# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | శుక్రవారం 18-6-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 267 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## కాంట్రాక్ట్ లెక్చరర్లకు బేసిక్ పే అమలు : మంత్రి హరీష్ రావు



హైదరాబాద్ , జూన్ 17: రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్లకు బేసిక్ పే అమలు చేస్తున్నట్లు మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన జీవోలు 104, 105, 106 లను కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ నేతలకు మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలను మంత్రులు అభినందించారు. బేసిక్ పే జీవో విడుదల చేసినందుకు వారు ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో సీఎస్ సోమేష్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్ కనక చంద్రం, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దరిపల్లి నగేష్ మరియు రాష్ట్ర మహిళా సెక్రెటరీ మాలతి, డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్ల అధ్యక్షులు వినోద్ కుమార్, పాలిటెక్నిక్ కళాశాల అధ్యక్షులు ఉమ శంకర్, రాష్ట్ర నాయకులు సదానందం పాల్గొన్నారు.

## నెక్లెస్ రోడ్డులో 26న డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రారంభం

హైదరాబాద్ , జూన్ 17:పేదలు గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్న సంగతి తెలిసిందే. నగరంలోని నెక్లెస్‌రోడ్డు అంబేడ్కర్ నగర్‌లో నిర్మించిన 330 డబుల్ బెడ్రూం ఇండ్లను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం పరిశీలించారు. ఈ నెల 26వ తేదీన ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభిస్తామని మంత్రి తలసాని పేర్కొన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు.

## తెలంగాణలో మూడు రోజులపాటు వర్షాలే..

హైదరాబాద్ , జూన్ 17: తెలంగాణలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో చురుగ్గా కదులుతున్నాయి. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని వెల్లడించింది. పలు ప్రాంతాల్లో రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. నైరుతి, పశ్చిమ దిశల నుంచి బలంగా గాలులు వీస్తున్నాయని వాతావరణశాఖ వివరించింది.

## తమ కొత్త అంతరిక్ష కేంద్రానికి వ్యోమగాములను పంపిన చైనా

బీజింగ్, జూన్ 17:: డ్రాగన్ దేశం చైనా కొత్తగా నిర్మించిన అంతరిక్ష కేంద్రానికి తన వ్యోమగాములను పంపింది. ఇవాళ ఉదయం ముగ్గురు చైనా వ్యోమగాములు నింగికెగిరారు. లాంగ్ మార్చ్ 2ఎఫ్ రాకెట్ ద్వారా.. షెన్‌జూ12 క్యాప్సూల్‌లో ఆస్ట్రోనాట్స్ వెళ్లారు. నీ హైషెంగ్, లయూ బోమింగ్, టాంగ్ హోంగ్‌బోలు.. అంతరిక్ష కేంద్రంలో మూడు నెలలు గడపనున్నారు. భూమికి 380 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న తియాన్‌హీ మాడ్యూల్‌లో వాళ్లు ఉండనున్నారు. గోబి ఎడారిలో ఉన్న జిక్వాన్ శాటిలైట్ లాంచింగ్ కేంద్రం నుంచి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ ప్రయోగంతో చైనా అంతరిక్ష పరిశోధనల్లో తన సత్తా మరోసారి చాటింది. ఇటీవలే చంద్రుడి ఉపరితలం నుంచి రాళ్లు, మట్టి శ్యాంపిళ్లను చైనా తీసుకువచ్చింది. కొన్ని రోజుల క్రితమే మార్స్ గ్రహంపై ఆ దేశానికి చెందిన రోబో దిగింది. రెండు అసాధారణ పరీక్షల్లో చైనా సక్సెస్ కావడం విశేషం.

తమ కొత్త అంతరిక్ష కేంద్రానికి వ్యోమగాములను పంపిన చైనా షెన్‌జూ-12 మిషన్‌లో భాగంగా అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన ముగ్గురు వ్యోమగాములు.. అక్కడ ఉన్న తియాన్‌హీ మాడ్యూల్‌ను ఆపరేట్ చేయనున్నారు. దాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నారు. తియాన్‌హీ సిలిండర్‌ను ఏప్రిల్‌లో చైనా ప్రయోగించింది. దాని పొడుగు 16.6 మీటర్లు.. వెడల్పు 4.2 మీటర్లు. ఆ పరికరం దాదాపు 70 టన్నులు ఉంటుంది. దాంట్లో లీవింగ్ క్వార్టర్స్, సైన్స్ ల్యాబ్స్, హబుల్ క్లాస్ టెలిస్కోప్‌లు ఉన్నాయి.

నిజానికి నింగికి ఎగిరిన ఆస్ట్రోనాట్ల గురించి చైనా చివరి నిమిషం వరకు వారి వివరాలను వెల్లడించలేదు. కేవలం ఒక రోజు ముందు మాత్రమే ఆ ముగ్గురు వ్యోమగాముల వివరాలు బయటపెట్టింది. 56 ఏళ్ల నీ హైషెంగ్.. చైనాలో ఎక్కువ అనుభవం ఉన్న ఆస్ట్రోనాట్. గతంలో రెండసార్లు అతను రోదసిలోకి వెళ్లాడు. 2013లో నీ హైషెంగ్ ప్రోటోటైప్ స్పేస్ స్టేషన్‌లో 15 రోజులు గడిపారు. ఇక మిగితా ఇద్దరు వ్యోమగాములకు ఎయిర్‌ఫోర్స్ అనుభవం ఉన్నది.

## మేడిగడ్డ బ్యారేజీకి ఇన్‌ఫ్లో.. 10 గేట్లు ఎత్తివేత

హైదరాబాద్ , జూన్ 17:జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీకి ఎగువ నుంచి వరద వస్తుండటంతో అధికారులు 10 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో దిగువన ఉన్న మేడిగడ్డ బ్యారేజీకి దాదాపు 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. దీంతో అధికారులు బ్యారేజ్ 10 గేట్లను ఎత్తి 23,500 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు

## నెలాఖరు నాటికి 45 ఏండ్ల పైబడిన వారిలో 80 శాతం మందికి వ్యాక్సినేషన్!



బెంగళూర్, జూన్ 17:: జూన్ మాసాంతానికి కర్నాటకలో 45 ఏండ్లు పైబడిన వారిలో 80 శాతం మందికి వ్యాక్సినేషన్ పూర్తవుతుందని డిప్యూటీ సీఎం అశ్వథ్ నారాయణన్ పేర్కొన్నారు. వ్యాక్సిన్ల కొరతతో బెంగళూర్ లో 45 ఏండ్లు పైబడిన వారిలో ఇప్పటివరకూ 63 శాతం మందికే వ్యాక్సినేషన్ చేపట్టామని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో 18-45 ఏండ్ల మధ్య వయస్కులకూ వ్యాక్సినేషన్ సాగుతోందని ఏడాది చివరికి రాష్ట్ర జనాభాలో 18 ఏండ్లు పైబడిన వారందరికీ కనీసం సింగిల్ డోస్ వ్యాక్సిన్ అందిస్తామని చెప్పారు.

థర్డ్ వేవ్ చిన్నారులపైనే ప్రభావం చూపదని వ్యాక్సిన్ తీసుకోని వారితో పాటు, ఇప్పటికీ ఇన్ఫెక్షన్ సోకని వారిపై ప్రభావం చూపుతుందని వైద్యారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. యువ తల్లితండ్రులు వ్యాక్సిన్ వేయించుకోవడంలో అలసత్వం వహిస్తే థర్డ్ వేవ్ లో చిన్నారులు కరోనా బారినపడే ప్రమాదం అధికంగా ఉంటుందని ఏస్టర్ సీఎంఐ ఆస్పత్రి పీడియాట్రీషియన్ డాక్టర్ చేతన్ గినిగెరి హెచ్చరించారు.

## 2 నుంచి 4 వారాల్లోగా.. మహారాష్ట్రలో థర్డ్ వేవ్

ముంబై, జూన్ 17:: సెకండ్ వేవ్‌తో అతలాకుతలం అయిన మహారాష్ట్రకు మళ్లీ గడ్డు రోజులు సమీపిస్తున్నాయి. కోవిడ్ థార్డ్ వేవ్ ఆ రాష్ట్రాన్ని మరో రెండు లేదా నాలుగు వారాల్లో తాకనున్నట్లు ఆ రాష్ట్ర టాస్క్ ఫోర్స్ వార్నింగ్ ఇచ్చింది. కానీ థార్డ్ వేవ్‌లో చిన్నారులపై పెద్దగా ప్రభావం ఉండదని ఆ టాస్క్ ఫోర్స్ చెప్పింది. మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ అంచనాలు చేసినట్లు తెలుస్తోంది. సెకండ్ వేవ్ కన్నా రెట్టింపు సంఖ్యలో థార్డ్ వేవ్ పాజిటివ్ కేసులు నమోదు అవుతాయని అంచనా వేస్తున్నారు. సుమారు 8 లక్షల మందికి వైరస్ సోకే ప్రమాదం ఉందన్నారు. దాంట్లో కేవలం 10 శాతం కేసులు పిల్లల్లో నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయి. బ్రిటన్‌లోనూ సెకండ్ వేవ్ ముగిసిన నాలుగు వారాలకు థార్డ్ వేవ్ వచ్చిందని, అదే రీతిలో మనకు ప్రమాదం పొంచి ఉన్నట్లు టాస్క్ ఫోర్స్ సభ్యుడు డాక్టర్ శశాంక్ జోషీ తెలిపారు.

మహారాష్ట్రలో ప్రస్తుతం అయిదు దశల్లో అన్‌లాక్ ప్రక్రియ జరుగుతున్నది. నాగపూర్, పుణెతో పాటు 15 జిల్లాలో ఆంక్షలు సడలించారు. ముంబైతో పాటు థానే, వాసాయి, కళ్యాణ్ ప్రాంతాల్లో ఆంక్షలు మరోలా ఉన్నాయి. మరో 34 జిల్లాల్లో వేర్వేరుగా అన్‌లాక్ ప్రక్రియ అమలు చేస్తున్నారు.

## ట్విట్టర్‌ను నియంత్రించలేకపోతున్న కేంద్రం : మమతా బెనర్జీ

కోల్‌కతా, జూన్ 17: : బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ట్విట్టర్‌ను నియంత్రించలేకపోతోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. కట్టడి చేయలేకే ట్విట్టర్‌ను అణిచివేయాలని చూస్తున్నట్లు తెలిపారు. దీన్ని తాము ఖండిస్తున్నట్లు చెప్పారు. గురువారం మమతా బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ.. నూతన మార్గదర్శకాల ప్రకారం సమస్యల పరిష్కారానికి ముఖ్య సిబ్బందిని నియమించడంలో వైఫల్యం కారణంగా సోషల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫాం భారతదేశంలో తన సేఫ్ హార్బర్ కవచాన్ని కోల్పోయిందన్నారు.

ట్విట్టర్ అంశం మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం తనని కూడా ఎదుర్కోలేకపోతోందన్నారు. తనని ఎదుర్కోలేకే తమ ప్రభుత్వాన్ని అణచివేసే యత్నం చేస్తోందన్నారు. కేంద్రం ఇకనైనా నియంతృత్వ ధోరణి ఆపాలన్నారు. బెంగాల్‌లో ఎక్కడా రాజకీయ హింస లేదన్నారు. రాజకీయ హింసను తాము ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ హింస అనేది కేవలం బీజేపీ జిమ్మిక్కేనన్నారు. నదిలో మృతదేహాలు తేలుతున్న యూపీపై కేంద్రం దృష్టిపెట్టాలని ఈ సందర్భంగా సూచించారు. యస్ తుపాను తర్వాత ఇప్పటికీ కేంద్ర ఆర్థికసాయం లేదన్నారు.

## మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం భేటీ

హైదరాబాద్ , జూన్ 17:తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు అధ్యక్షతన రాష్ట్రంలో ప్రభుత్వ ఆదాయం పెంచుకునే మార్గం వంటి అంశాలపై ప్రభుత్వం నియమించిన మంత్రి వర్గ ఉపసంఘం తొలిసారి సమావేశమైంది. ఇందులో మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, సీఎస్ సోమేశ్ కుమార్ పాల్గొన్నారు. గృహనిర్మాణ సంస్థ పరిధిలోని భూములు, ఇళ్ల విక్రయాలపై సమావేశంలో చర్చిస్తున్నారు. నిధుల సమీకరణపై సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు.

అదేవిధంగా సమావేశం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రుల స్థితిగతులు, సౌకర్యాలపై మంత్రివర్గ ఉపసంఘం చర్చిస్తుంది. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. త్వరలో మంత్రివర్గ ఉపసంఘం ఇతర దేశాలు, రాష్ట్రాల్లోని అత్యుత్తమ వైద్య సేవలు, వైద్య సేవల మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేయనున్న నేపథ్యంలో దీనిపై కూడా మంత్రులు చర్చిస్తున్నారు.

## కరోనాతో తల్లి మృతి : కడసారి చూసేందుకు కొడుకును రూ 5000 డిమాండ్ చేసిన సిబ్బంది

భువనేశ్వర్, జూన్ 7:: కొవిడ్-19తో మరణించిన తల్లిని కడసారి చూసేందుకు కొడుకును స్మశాన వాటిక సిబ్బంది ఒకరు రూ 5000 డిమాండ్ చేసిన ఘటన ఒడిషాలోని కెంజిహార్ జిల్లాలో వెలుగుచూసింది. కరోనా సెకండ్ వేవ్ లో కొవిడ్ మృతదేహాలతో స్మశానాలు నిండిపోయిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మహిళ ముఖాన్ని కుమారుడికి చూపేందుకు సిబ్బంది రూ 5000 డిమాండ్ చేయడం వీడియోలో కనిపించింది.రూ 5000 ఇస్తే ముఖాన్ని చూపుతా లేకుంటే పీపీఈ కిట్ లో ప్యాక్ చేసిన మృతదేహానికి అలాగే అంత్యక్రియలు నిర్వహిస్తా అంటూ సిబ్బంది మృతురాలి కొడుకుతో గట్టిగా చెబుతుండటం వైరల్ వీడియోలో వినిపించింది. ఈ వ్యవహారాన్ని మహిళ కుమారుడు మొబైల్ ఫోన్ లో రికార్డు చేస్తుండగా ఉద్యోగి వారించాడు. తాను వీడియోను రికార్డు చేయడంతో పాటు ఇంటర్ నెట్ లో అప్ లోడ్ చేస్తానని తనను జైలు పంపినా పట్టించుకోనని మృతురాలి కొడుకు తేల్చిచెప్పాడు.

ఈ వీడియో వైరల్ కావడంతో స్థానికులు లంచం అడిగిన ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీడియో తమ నోటీసుకు వచ్చిందని, ఈ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించామని, నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ ఆశిష్ ఠాక్రే వెల్లడించారు.

## రహదారులను ఆధునీకరించేందుకు భారత్-ఏడీబీ ఒప్పందం?

న్యూఢిల్లీ, జూన్ 17: తమిళనాడు రాష్ట్రంలో చెన్నై,కన్యాకుమారి పారిశ్రామిక కారిడార్ (సికెఐసి)లో పారిశ్రామిక అభివృద్ధి చేసేందుకు, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి), భారత ప్రభుత్వం 484 మిలియన్ డాలర్ల రుణ కేటాయింపు ఒప్పందంపై సంతకాలు చేశాయి. పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడు వరకు విస్తరించి ఉన్న ఇండియన్ ఈస్ట్ కోస్ట్ ఎకనామిక్ కారిడార్(ఈస్ట్ కోస్ట్ ఎకనమిక్ కారిడార్ ? ఇసిఇసి)లో సికెఐసి భాగం. ఇది దక్షిణ, ఆగ్నేయ, తూర్పు ఆసియాలోని ఉత్పత్తి నెట్ వర్క్‌లతో భారత్ ను అనుసంధానం చేస్తుంది. ఇసిఇసిని అభివృద్ధి చేయడంలో భారత ప్రభుత్వానికి ప్రధాన భాగస్వామిగా ఎడిబి వ్యవహరిస్తున్నది.

భారత ప్రభుత్వం తరపున తమిళనాడు పారిశ్రామిక అనుసంధాన ప్రాజెక్టు కోసం ఆర్థిక వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రా సంతకం చేయగా, భారత్ లోని ఎడిబి కంట్రీ డైరెక్టర్ తకో కొనేషీ ఎడిబి తరపున సంతకం చేశారు. పారిశ్రామిక సదుపాయాలు, రవాణా, వినియోగ కేంద్రాల మధ్య నిరాటంకమైన సౌకర్యాలుపెంచడానికి ఈ ప్రాజెక్టు కీలకం. ఇది సికెఐసి పరిశ్రమల ఉత్పాదక ఖర్చును తగ్గించడమే కాకుండా వాటిని ప్రోత్సహిస్తుందని, మిశ్రా పేర్కొన్నారు.

## అర్హులందరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు : మంత్రి ఐకే రెడ్డి



నిర్మల్. జూన్ 17:: పేదలు ఆత్మ గౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం పథకం ప్రవేశ పెట్టారని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణ వాసుల కోసం సిద్ధాపూర్ లో రూ.31.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 600 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు అందజేస్తామన్నారు. స్వరాష్ట్రంలో ప్రతి పేదవాడు రెండు పడకల ఇంటిలో సకల సౌకర్యాలతో దర్జాగా కాలుమీద కాలేసుకుని బతకాలన్న సీఎం కేసీఆర్ మహోన్నత ఆశయం మేరకే ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపట్టిందని పేర్కొన్నారు.

పట్టణ వాసులు కోసం 2100 ఇండ్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు సొంత జాగా ఉన్న వారు స్వయంగా వారే ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఎక్కడా కూడా అభివృద్ధి పనులు ఆగలేదని, సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేస్తున్న ఘనత ఒక్క తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని హామీనిచ్చారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ జయమే మన జీవితముగ...
భయమే మన కున్నయట్టి బలశత్రువుగా....
రయమున బెలపగ....గాలటును
ప్రియవాది॥...పేరుగాన్న "పెండేకంటి"కి ॥

-రాధశ్రీ



( జూన్ 18 నేత పెండేకంటి వెంకట సుబ్బయ్యజయంతి...)

సెల్: 9494481210

## మిర్యాలగూడలో అందుబాటులోకి స్పుత్నిక్ వీ వ్యాక్సిన్

హైదరాబాద్ , జూన్ 17: స్పుత్నిక్ వీ టీకాల పంపిణీ ఇండియాలో ప్రారంభమైన విషయం తెలిసిందే. రష్యాకు చెందిన ఆ వ్యాక్సిన్‌ను .. మన దేశంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నది. ప్రస్తుతం పైలట్ పద్ధతిలో టీకాలను అందుబాటులోకి తెస్తున్నారు. అయితే స్పుత్నిక్ వీ టీకాలు ఇక నుంచి మరో 9 నగరాల్లో అందబాటులోకి వస్తాయని ఇవాళ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఆ నగరాల జాబితాలో తెలంగాణకు చెందిన మిర్యాలగూడ ఉన్నది. ఇక మిగితా నగరాల్లో బెంగుళూరు, ముంబై, చెన్నై, విశాఖపట్టణం, బడ్డి, కోల్హాపూర్‌లు ఉన్నాయి. తొలుత ఈ టీకాను హైదరాబాద్‌లో లాంచ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం స్పుత్నిక్ వీ టీకాలను కోవిన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యం లేదు. పైలట్ లాంచింగ్ ప్రక్రియ తుది దశలో ఉన్నదని, రెండు డోసుల టీకాలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతుందని రెడ్డీస్ ల్యాబ్ చెప్పింది. మైనస్ 18డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద స్పుత్నిక్ వీ టీకాలను నిల్వ చేస్తారు.

## మాన్సాస్ ఛైర్మెన్ కు అవమానం.. ప్రభుత్వ తీరుపై అశోక్ గజపతిరాజు ఫైర్

న్యూఢిల్లీ, జూన్ 17:ఏపీ హైకోర్టు తీర్పుతో సింహాచలం, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ గా మళ్లీ బాధ్యతలు చేపట్టిన టీడీపీ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజుకు ప్రభుత్వం నుంచి సహకారం లభించడం లేదు. నిన్న సింహాచలంలో నేడు మాన్సాస్ ట్రస్ట్ లోనూ అశోక్ గజపతి రాజుకు తీవ్ర అవమానాలు ఎదురయ్యాయి. అధికారులు కనీసం ఆయనను పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వం తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు.కోర్టు తీర్పు తరువాత మాన్సాస్ ఛైర్మెన్‌గా అశోక్ గజపతిరాజు సంతకం చేశారు. ఈ కార్యక్రమానికి మాన్సస్ ఈవో వెంకటేశ్వర రావు, కరెస్పాండెంట్ కేవీఎల్ రాజు గైర్హాజరు కావడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ట్రస్ట్ నిర్వహణలో అధికారులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాన్సాస్‌లో ఆడిట్ జరగలేదంటే ఆశ్చర్యపోయానన్నారు. ఆడిట్ జరిపించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదేనన్నారు. ప్రతి ఏడాది ఆడిట్ జరపటానికి సంస్థ నుంచి ఫీజు కూడా అధికారికంగా చెల్లించామన్నారు. దోపిడిదారులకు మాన్సాస్‌లో స్థానం లేదని అశోక్ గజపతి రాజు పేర్కొన్నారు. అలాగే రామతీర్థం విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమానికి కూడా తనను ఆహ్వానించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాన్సాస్ ఛైర్మెన్‌గా తమ ప్రథమ ప్రాధాన్యం విద్యకేనన్నారు. దాని కోసం ప్రభుత్వ సహకారాన్ని కూడా అర్థిస్తామన్నారు.

హిందూ మతంపై వైసీపీ ప్రభుత్వం ఎందుకు దాడులు చేస్తోందని అశోక్ గజపతి రాజు ప్రశ్నించారు. దుండగుల దాడిలో రాముని శిరస్సు ఖండించిన వారిని పట్టుకోకపోగా.. ఆలయ బాగు కోసం విరాళం ఇచ్చినా తిరస్కరించటం తీవ్ర మానసిక క్షోభకు గురి చేసిందన్నారు. దేశంలో ఇంకా హిందూ మతం బతికుండటంతో ఆ విరాళం అయోధ్యలో సమర్పించామన్నారు. మహారాజకోటలో చారిత్రక మూలాలు ధ్వంసం చేశారన్నారు. సింహాచలం దేవస్థానం వద్ద ఆలయ ఈవో కూడా తనను కలవడానికి ఇష్ట పడలేదన్నారు. మాన్సస్ భూముల్లో ఇసుక అక్రమాలు ఎవరి హయాంలో జరిగాయో తేల్చాలని అశోక్ గజపతి రాజు చెప్పారు.

# ఈటలకు హైకోర్టు షాక్.. సర్వే చేస్తే తప్పేంటి?

న్యూఢిల్లీ, జూన్ 17:దేవరయాంజల్ భూముల సర్వేపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేవరయాంజల్ భూముల అవకతవకలపై విచారణ జరిపేందుకు జారీ చేసిన 1014 జీవోను రద్దు చేయడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. దేవాలయ భూములు గుర్తించేందుకు సర్వే చేస్తే తప్పేంటని ప్రశ్నించింది. గురువారం దేవరయాంజల్ భూముల సర్వేపై హైకోర్టులో విచారణ జరిగింది. ఐఏఎస్‌ల కమిటీ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని సదా కేశవ రెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. అయితే, జీవో 1014 అమలును నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. దేవాలయ భూములు గుర్తించేందుకు సర్వే చేస్తే తప్పేంటని ప్రశ్నించింది. అలాగే, ప్రభుత్వ, ఆలయ భూములను గుర్తించకూడదా? అని నిలదీసింది. కబ్జాదారులను ఆక్రమణలు చేసుకోనీయాలా? అని వ్యాఖ్యానించింది.

దేవరయాంజల్ భూములపై విచారణ జరిపి నివేదిక ఇవ్వడమే కమిటీ బాధ్యతని పేర్కొంది. అయితే, నోటీసులు ఇవ్వకుండానే భూముల్లోకి వచ్చి సర్వే చేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. దేవరయాంజల్ భూములపై విచారణ చేసే స్వేచ్ఛ కమిటీకి ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే, భూముల్లోకి వెళ్లే ముందు నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. పిటిషనర్లపై చర్యలు తీసుకుంటే ముందస్తు నోటీసు ఇవ్వాలని తెలిపింది. అధికారులకు అవసరమైన దస్త్రాలు, సమాచారం ఇవ్వాలని పిటిషనర్లకు ఆదేశించింది. ఒకవేళ విచారణకు సహకరించకపోతే అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

కాగా, మాజీమంత్రి ఈటల రాజేందర్ మేడ్చల్ జిల్లా శామీర్ పేట శివారులోని దేవరయాంజల్ గ్రామంలోని సీతారాముల ఆలయ భూములను కబ్జా చేశారని ఆరోపణలు వచ్చాయి. దేవరయాంజల్‌లో ఆలయ భూములను ఆక్రమించారనే ఆరోపణలపై విచారణ జరిపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నలుగురు ఐఏఎస్‌లతో కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మే 3న ప్రభుత్వం జారీ చేసిన జీవో 1014ను సవాల్ చేస్తూ హైకోర్టు పిటిషన్ దాఖలైంది. దేవరయాంజల్ భూముల వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవద్దని పిటిషనర్ కోరారు.

## వంట నూనెలపై సుంకం తగ్గించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, జూన్ 17:భారీగా పెరిగిన వంట నూనెల ధరలతో ఇబ్బందులుపడిన వినియోగదారులకు ఊరట లభించింది. వంట నూనెల దిగుమతులపై సుంకం డ్యూటీ తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వంట నూనెల రేట్లు ఇటీవల రికార్డు స్థాయికి చేరడంతో డ్యూటీ తగ్గింపు నిర్ణయం తీసుకుంది. దాదాపు 20 శాతం వరకు ధరల తగ్గింపు ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కేంద్ర పరోక్ష పన్నులు , కస్టమ్స్ బోర్డు దిగుమతి తగ్గింపు నోటిఫికేషన్‌ను జారీ చేసింది. కొత్త రేట్లు 2021 జూన్ 17 వ తేదీ నుండి అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని టన్నుకు 87 డాలర్లు తగ్గి 1136 కు తగ్గించగా, ముడి సోయా చమురు దిగుమతి సుంకం టన్నుకు 37 డాలర్లు తగ్గించింది. దీంతో ప్రస్తుతం దీని ధర టన్నుకు 1415 డాలర్లుగా ఉంది. అటు ఆర్బీడి పామాయిల్ పై టన్నుకు 1148 డాలర్లకు దిగివచ్చింది. తాజా తగ్గింపుతో దేశీయంగా ఆవాలు, సోయాబీన్?, వేరుశనగల రేట్లు కూడా దిగిరానున్నాయి.

వంట నూనెల ధరలు కిలోకు:
పామాయిల్: రూ.115, (పాత ధర142, 19 శాతం తగ్గింది)
పొద్దుతిరుగుడు నూనె: రూ. 157 (పాత ధర రూ .188, 16 శాతం తగ్గింది)
సోయా నూనె: రూ.138 ( పాత ధర రూ. 162 , 15 శాతం తగ్గింది)
ఆవ నూనె: రూ.157 (పాత ధర రూ. 175 , 10 శాతం తగ్గింపు)
వేరుశనగ నూనె: రూ. 174,(పాత ధరరూ.190, 8 శాతం తగ్గింపు)
వనస్పతి: రూ. 141 (పాత ధర 184, 8 శాతం తగ్గింపు)

## హుజురాబాద్ లో హైటెన్షన్.. ఈటల వర్సెస్ పల్లా

హైదరాబాద్ , జూన్ 17:హుజురాబాద్‌లో రాజకీయం వేడెక్కింది. హుజురాబాద్ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రధాన పార్టీల నేతలంతా నియోజకవర్గంలో మకాం వేశారు. టీఆర్ఎస్, బీజేపీ నాయకులు ముమ్మరంగా పర్యటిస్తున్నారు. ఈటల రాజేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికార టీఆర్ఎస్ నేతలు హుజురాబాద్ లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గురువారం టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి పర్యటిస్తున్నారు. మరోవైపు ఇటీవలే బీజేపీలో చేరిన మాజీ మంత్రి ఈటల రాజేందర్ తొలిసారి హుజురాబాద్‌కు వెళ్లారు. దీంతో హుజురాబాద్?లో టెన్షన్ వాతావరణం నెలకొంది.

టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఒకే పర్యటన చేయడం రాజకీయాలను వేడి పెంచింది. హుజురాబాద్?లోని కాట్రపల్లి వద్ద ఈటల-పల్లా రాజేశ్వర్ వాహనాలు ఎదురెదురుగా వచ్చాయి. ఈటల బీజేపీలో చేరిన తర్వాత తొలిసారి హుజురాబాద్ నియోజకవర్గానికి వచ్చారు. దీంతో ఆయనకు స్వాగతం చెప్పేందుకు హుజురాబాద్ లోని కాట్రపల్లి ఎక్స్ రోడ్డు వద్ద బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. అదే సమయంలో హుజురాబాద్‌లోని జమ్మికుంటకు పల్లా కాన్వాయ్ వెళుతుంది. పల్లాను చూసిన ఈటల అనుచరులు, బీజేపీ కార్యకర్తలు 'జై ఈటల.. జైజై ఈటల.. జై బీజేపీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. పల్లా కాన్వాయ్ రెండు నిముషాలపాటు ఆగిపోయింది. అయితే, పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచరులు కూడా 'జై టీఆర్ఎస్.. జై పల్లా రాజేశ్వర్ రెడ్డి' అంటూ పోటా పోటీగా నినాదాలు చేశారు. ఇలా ఇరుపార్టీల నినాదాలతో కాట్రపల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే, పోలీసులు రంగంలోకి దిగి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇరువర్గీయులను పంపించారు. ఈటల నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు.

## ఇండో–పసిఫిక్‌ప్రాంతంలో సామరస్యపూర్వక పరిస్థితి నెలకొనాలి

న్యూఢిల్లీ, జూన్ 17:దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తూ ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సామరస్యపూర్వక వాతావరణాన్ని నెలకొల్పడానికి కృషి జరగవలసి ఉంటుందని రక్షణశాఖ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్ అన్నారు. 2021 జూన్ 16వ తేదీన జరిగిన ఆసియాన్(ఆగ్నేయాసియా దేశాల అసోసియేషన్) రక్షణశాఖల మంత్రుల ప్లస్ సమావేశంలో శ్రీ రాజనాథ్ సింగ్ పాల్గొన్నారు. పది ఆసియా దేశాలు, ఎనిమిది సంప్రదింపుల దేశాల (ఆస్ట్రేలియా, చైనా, ఇండియా, జపాన్, న్యూజిలాండ్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, రష్యా మరియు యునైటెడ్ స్టేట్స్) రక్షణశాఖల మంత్రులు సభ్యులుగా వుండే ఆసియాన్ ప్రతి ఏడాది సమావేశం అవుతూ వివిధ అంశాలపై చర్చలు జరుపుతుంది. ఈ ఏడాది ఆసియాన్ రక్షణ శాఖల మంత్రుల సమావేశం బ్రూనై అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఇండో–పసిఫిక్ ప్రాంతానికి చెందిన అనేక అంశాలను ప్రస్తావించిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలను గౌరవిస్తూ చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి జరగాలని పిలుపు ఇచ్చారు.

ఇండో–పసిఫిక్ ప్రాంత అభివృద్ధికి భారతదేశం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్ శాంతి, స్థిరత్వం మరియు శ్రేయస్సుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని అన్నారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఆసియాన్ స్ఫూర్తిగా ఆసియా దేశాల్లో కీలక పాత్ర పోషించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రత అంశంపై జరిగిన చర్చల్లో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ భారతదేశ అభిప్రాయాలను ఆసియాన్ రక్షణ శాఖల మంత్రులకు స్పష్టంగా వివరించారు. గతంలో అనుసరించిన విధానాలతో . అంతర్జాతీయ శాంతి మరియు భద్రతకు ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. సముద్రజలాలపై ఐక్యరాజ్యసమితి ఆమోదించిన చట్టాలకు లోబడి సముద్ర విమాన మార్గాల్లో స్వేచ్ఛగా రవాణా జరగాలని వాణిజ్య కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదన్నది భారతదేశ అభిప్రాయమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. సముద్ర భద్రతా అంశానికి భారతదేశం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు మరియు అభివృద్ధి అంశాల్లో సముద్ర మార్గాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అంతర్జాతీయ చట్టాలకు లోబడి సమావేశం నిర్ణయాలను తీసుకోవాలని కోరిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వీటివల్ల చర్చల్లో పాల్గొనని దేశాల ప్రయోజనాలు దెబ్బ తినకుండా చూడాలని అన్నారు. ద్వైపాక్షిక, ప్రాంతీయ మరియు బహుపాక్షిక స్థాయిలలో నిరంతరం చర్చలను నిర్వహిస్తూ ఇండో–పసిఫిక్ ప్రాంత దేశాలతో సామరస్యంగా వ్యవహరిస్తూ ఆర్థిక సహకారం, సాంస్కృతిక సంబంధాలు పెంపొందించు కోవాలన్న సిద్ధాంతాన్ని భారతదేశం అనుసరిస్తున్నదని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. దీనిలో భాగంగానే ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ 2014 నవంబర్ నెలలో 'యాక్ట్ ఈస్ట్ పాలసీ' ని ప్రకటించారని మంత్రి తెలిపారు.

# విహారయాత్రలతో మానసిక ఉల్లాసం

(18 జూన్ 'అంతర్జాతీయ విహార యాత్రల దినం' సందర్భంగా)

ఆధునిక వేగవంతమైన ఉరుకుల పరుగుల జీవితంలో ఎవ్వరికీ విశ్రాంతి లేదు, విరామ సమయం దొరకదు. జీవితాలు యంత్ర సమానం అయ్యాయి. ఉల్లాస క్షణాలు కరువయ్యాయి. సంతోషంగా కుటుంబ సభ్యులతో గడిపే ఘడియలు బహు అరుదైనాయి. నవ్య నాగరికతలో అమ్మ నాన్నలు ఉద్యోగులుగా, పిల్లలు విద్యార్జన పనుల్లో బిజీగా ఉండడంతో అందరూ కలిసి మాట్లాడుకోవడం, ఆటపాటల్లో మునగడం అసాధ్యమైపోతున్నది. మన యాంత్రిక జీవితాల్లో కొంత ఉపశమనం, ఉల్లాసం కోసం విహార యాత్రలు, ప్రర్యాటక క్షేత్ర దర్శనాలు, విజ్ఞాన యాత్రలు లాంటివి ఉపయోగపడతాయి. పిక్నిక్ లేదా విహార యాత్రల్లో సహజ ప్రకృతితో మమేకమవుతూ, హరిత దుప్పట్ల మీద కుటుంబ సభ్యులు భోజనాలు చేస్తూ ఆనంద క్షణాలు ఆస్వాదించడం ఓ అద్భుత అవకాశం. దైనందిన జీవన పయనంలోంచి స్వల్ప విరామం తీసుకొని, మానసిక ఉల్లాసం పొందడానికి బంధువులు, స్నేహితులతో విహార యాత్రలు చేయాలనే అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి ఏట 18 జూన్‌న 'అంతర్జాతీయ విహారయాత్రల దినం (ఇంటర్నేషనల్ పిక్నిక్ డే)' పాటించుట జరుగుతున్నది. 1800 మధ్య కాలంలో ఫ్రెంచ్ విప్లవ సమయాన విహారయాత్రల ఆలోచనలు ప్రారంభమైనాయి. 20 జూన్ 2009న లిస్బన్, పోర్చుగల్‌లో 22,000 మందితో నిర్వహించిన అతి పెద్ద విహారయాత్ర 'గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది.

అంతర్జాతీయ విహారయాత్రల దినం రోజున విద్యాలయాలు, కుటుంబాలు విహార యాత్రలు నిర్వహించుట జరుగుతుంది. పలు తినుబండారాలు, శీతలపానీయాలు, స్వీట్లు, పండ్లు, కేక్‌లు, సాండ్‌విచ్చెస్ లాంటి అనేక రకాల ఆహార పదార్థాలతో పాటు క్రీడా వస్తువులు వెంట తీసుకొని విహారయాత్రలకు వెళతారు. ప్రతి ఒక్కరు ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదిస్తూ, తమ వయసును మరిచి, పిల్లలుగా మారిపోతూ, సాంస్కృతిక కార్యక్రమాలతో అమితానందాన్ని పొందుతూ, మానసిక ఉల్లాసాన్ని పొందుటకు, మనసు తేలిక పరుచుకునేందుకు విహారయాత్రలు ఉపయోగపడతాయి. విహారయాత్రలతో పిల్లలకు ప్రకృతి అందాలు అనుభవించే అద్భుత అరుదైన అవకాశం దొరుకుతుంది. విహారయాత్రలు పిల్లలకు విజ్ఞానయాత్రలుగా కూడా ఉపయోగపడతాయి. జూన్ 3వ వారంలో వాతావరణం కూడా అహ్లాదకరంగా, ఆకర్షణీయంగా విహారయాత్రలకు అనుకూలంగా ఉంటుంది. నేటి కోవిడ్–19 మహమ్మారి అకాలంలో విహారయాత్రలకు అధికసంఖ్యలో బయటకు వెళ్లడం, భౌతిక దూరాలు పాటించడం వీలుకాని సందర్భాల్లో తక్కువ సంఖ్యలో ఇంటి గార్డెన్స్ లేదా ఆవరణలో, సమీప ప్రకృతిలో పిక్నిక్‌లను కరోనా నియమనిబంధనలు పాటిస్తూ నిర్వహించడం ద్వారా మానసిక ఆరోగ్యం పెరుగుతుందని గమనించాలి. విహారయాత్రల నిర్వహణ ద్వారా పిల్లలకు, తల్లితండ్రులకు, తాతబామ్మలకు మధ్య చక్కటి ప్రేమానుబంధాలు ఏర్పడతాయి. ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో ఆగష్టు మె?దటి సోమవారం సెలవు దినంగా 'పిక్నిక్ డే' నిర్వహించుట జరుగుతుంది. జీవితాలను పరిపూర్ణంగా ఆస్వాదించడానికి, శారీరక మానసిక ఉల్లాసానికి దోహదపడే విహారయాత్రల వంటి అన్ని రకాల కార్యక్రమాలను నిర్వహించుకొనుటకు అందరు ముందుకు రావాలని, యాంత్రిక జీవితంలోంచి బయటపడి అపురూప ఆనంద క్షణాలను అనుభవించే అద్భుత అవకాశాలను జారవిడుచుకోవద్దని మనవి. ధనార్జన మాత్రమే ఆనందాన్ని ఇవ్వదని, ఆనందించలేని జీవితం నిరర్థకమని తెలుసుకుందాం. వానాకాలంలో వన భోజనాలకు ప్రణాళికలు వేద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా

హైదరాబాద్ , జూన్ 17:మనసును, శరీరాన్ని ఏకం చేసి మన జీవన శైలిని మార్చే అద్భుత ప్రక్రియ యోగా అని పూణే లో ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతిలో శిక్షణ పొందిన యోగా ట్రైనర్ శ్రీమతి జి. సుశీల అన్నారు. ప్రాణాయామం, యోగ, ధ్యానం వంటివి క్రమం తప్పకుండా ప్రతిరోజు చేయటం వలన శరీరంలో రోగ నిరోధక శక్తి గణనీయంగా పెరుగుతుందని, కోవిడ్ వంటి వైరస్ లను సులభంగా ఎదుర్కొనగలమని శ్రీమతి సుశీల తెలిపారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన రీజనల్ అవుట్ రీచ్ బ్యూరో (ఆర్ఓబి), పత్రికా సమాచార కార్యాలయం (పిఐబి) ఈ నెల 21 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' సందర్భంగా గురువారం 'ఆరోగ్యవంత మైన జీవనశైలికి యోగా' అన్న అంశం పై నిర్వహించిన వెబినార్ లో ముఖ్య వక్త గా శ్రీమతి జి. సుశీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీమతి సుశీల ప్రసంగిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఒక వ్యక్తి సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉన్నట్లని ఆమె అన్నారు. సహజ సిద్ధంగా లభించే పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు వంటి సాత్విక ఆహారం తీసుకోవడం, యోగ, ప్రతి రోజు కనీసం 4 లీటర్ల మంచి నీళ్లు త్రాగటం, 8 గంటలు నిద్ర పోవటం వంటి నియమాలు పాటించటం ద్వారా మానసిక వత్తిడిని అధిగమించడమే గాక శారీరకంగా దృఢంగా తయారవుతామన్నారు. సూక్ష్మ యోగ క్రియలు, ముఖ్యమైన యోగాసనాలు వివిధ ప్రాణాయామ పద్ధతులు ప్రదర్శనాత్మకంగా వివరించారు. వాటి వలన మన ఆరోగ్యానికి లభించే ప్రయోజనాలను గురించి తెలియజేశారు. తమ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ వెబినార్ ను నిర్వహించినట్లు పిఐబి ఒ ఆర్ఓబి డైరెక్టర్ శ్రీమతి శృతి పాటిల్ తెలిపారు. కోవిడ్ సంక్షోభ సమయంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు యోగా ఉపయోగ పడుతుందని, అలాగే, ఊపిరితిత్తుల సామర్థ్యం పెంచుకునేందుకు ప్రాణాయామం సహకరిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు అలవాటు లేనివారు కూడా ఈ యోగా దినోత్సవం సందర్భంగా యోగ, ప్రాణాయామం ప్రారంభించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# దేశవ్యాప్తంగా ఒకే విధంగా ఉండే పీయూసీ (పొల్యూషన్ అండర్ కంట్రోల్) సర్టిఫికెట్ నమూనా విడుదల

న్యూఢిల్లీ, జూన్ 17:కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు 1989 కింద జారీ చేస్తున్న పియుసి (పొల్యూషన్ అండర్ కంట్రోల్) సర్టిఫికెట్ దేశంలో అన్ని ప్రాంతాల్లో ఒకే తరహాలో ఉండేలా ఆదేశిస్తూ కేంద్ర రహదారి మరియు రహదారుల మంత్రిత్వ శాఖ 2021 జూన్ 14వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. నూతనంగా జారీ చేయనున్న పీయూసీసీ ముఖ్య లక్షణాలు:

దేశంలోని అన్ని ప్రాంతాల్లో జారీ అయ్యే పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) ఒకే తరహాలో ఉంటుంది. ప్రతి పీయూసీ సమాచారాన్ని జాతీయ రిజిస్టర్ తో అనుసంధానం చేస్తారు.

తిరస్కరణ స్లిప్ ను జారీ చేసే విధానాన్ని తొలిసారిగా అమలులోకి తీసుకుని రానున్నారు. నిర్ణీత ప్రమాణానికి మించి వాహనం నుంచి పొగ వెలువడితే ఆ వాహన యజమానికి తిరస్కరణ స్లిప్ జారీ చేస్తారు. వాహనాన్ని సర్వీస్ చేయడానికి లేదా మరో కేంద్రంలో పరీక్షించినప్పుడు పీయూసీసీ పరికరం సక్రమంగా పనిచేయడం లేదని చెప్పడానికి దీనిని ఉపయోగించవచ్చును.

సమాచారం గోప్యంగా ఉంటుంది. (తి) వాహన యజమాని పేరు, చిరునామా, మొబైల్ నెంబర్ (తితి) ఇంజిన్ , చాసిస్ నంబర్లు ( మొదటి మూడు సంఖ్యలు మాత్రమే కనిపించేలా చూసి మిగిలిన సంఖ్యలను కనపడకుండా చేస్తారు) వివరాలను గోప్యంగా ఉంచుతారు.

వాహన యజమాని తన మొబైల్ నెంబర్ ని తెలియ చేయడాన్ని తప్పనిసరి చేయడం జరిగింది. ధ్రువీకరణ మరియు రుసుము కోసం దీనికి ఎస్ఎంఎస్ వస్తుంది.

ప్రమాణాలకు లోబడి ఏదైనా ఒక వాహనం పొగను వెలువరిస్తున్నదని తనిఖీ అధికారి గుర్తించినప్పుడు ఆ అంశాన్ని సదరు అధికారి లిఖితపూర్వకంగా లేదా ఎలక్ట్రానిక్ పద్ధతిలో వాహన యజమాని లేదా దానిని నడుపుతున్న వ్యక్తికి తెలియజేసి అధీకృత పొల్యూషన్ అండర్ కంట్రోల్ కేంద్రాల్లో వాహనాన్ని పరీక్షించాలని ఆదేశించే అధికారం కలిగి ఉంటారు. ఆదేశాలను పాటించని యజమాని లేదా నడుపుతున్న వ్యక్తి పాటించనప్పుడు లేదా పరీక్షల్లో వాహనం సక్రమంగా లేదని వెల్లడయినప్పుడు వాహన యజమాని జరిమానా చెల్లించవలసి ఉంటుంది.

దీనికి వాహన యజమాని అంగీకరించని పక్షంలో 'పొల్యూషన్ అండర్ కంట్రోల్' సర్టిఫికెట్ వచ్చేంత వరకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తో పాటు జారీ అయిన పర్మిట్ ను తగిన కారణాలను లిఖితపూర్వకంగా తెలియచేస్తూ సస్పెండ్ చేసే అధికారం నమోదు సంస్థకు ఉంటుంది.

నూతన నిబంధనల వల్ల వాహనాలపై ఐటీ ఆధారిత పర్యవేక్షణ ఉంటుంది. దీనితో కాలుష్య కారక వాహనాలను నియంత్రించడానికి అవకాశం కలుగుతుంది.

పీయూసీ కేంద్ర పూర్తి వివరాలను తెలియజేసే క్యూఆర్ కోడ్ ను ఫారం పై ముద్రిస్తారు.

# విషపూరితం కాని, సున్నితమైన, దీర్ఘకాలం ప్రభావం చూపగల హ్యాండ్ శానిటైజర్‌ను త్వరలో మార్కెట్ లో ప్రవేశపెట్టనున్న పూణెకు చెందిన స్టార్టప్

న్యూఢిల్లీ, జూన్ 17:పర్యావరణ అనుకూల హ్యాండ్ శానిటైజర్ త్వరలోనే మార్కెట్‌లో అందుబాటులోకి రానుంది. చేతులను సున్నితంగా శుభ్రం చేయడమే కాక అవి పొడిబారకుండా ఈ శానిటైజర్ కాపాడుతుంది. ఆల్కహాల్ లేని, సజలం, మంట పుట్టించని, విషపూరితం కాని హ్యాండ్ శానిటైజర్ ను పూణెకు చెందిన స్టార్టప్ సిల్వర్ నానోపార్టికల్స్ అభివృద్ధి చేసింది. పదే పదే హ్యాండ్ శానిటైజర్‌ను ఉపయోగించడం వల్ల తరచుగా చేతులు పొడిబారిపోవడం అన్నది కోవిడ్ 19 మహమ్మారి సమయంలో ప్రజలు ఎదుర్కొన్న సవాలు. వియ్ఇన్నొవేట్ బయోసొల్యూషన్స్ అభివృద్ధి చేసిన హ్యాండ్ శానిటైజర్ యాంటీ మైక్రోబియల్ చర్యను పొడిగించి, పదే పదే దానిని రాసుకోవలసిన అవసరాన్ని తొలగిస్తుంది. అందులోని సిల్వర్ నానో పార్టికల్స్ తమ సంపర్కంలోకి వచ్చే సూక్ష్మజీవులను చంపేందుకు నిదానంగా, నిరంతరాయంగా సిల్వర్ అయాన్లను విడుదల చేస్తాయి. దీనిని సాధారణ పరిస్థితుల్లో నిల్వ చేయవచ్చు. సంస్థ ఇప్పటికే హ్యాండ్ శానిటైజర్ కు అవసరమైన క్లినికల్ ట్రయల్ ను విజయవంతంగా పూర్తి చేసి, వైరస్‌లను చంపగల అధిక సామర్థ్యాన్ని ప్రదర్శించి, కేంద్ర ఔషధ ప్రమాణాలు, నియంత్రణ సంస్థ (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ –సిడిఎస్‌సిఒ) ఆమోదాన్ని పొందింది. వియ్ఇన్నొవేట్ బయోసొల్యూషన్‌కు శాస్త్ర సాంకేతిక శాఖ (డిఎస్‌టి), పరిధిలోని జాతీయ శాస్త్ర, సాంకేతిక వ్యవస్థాపకత అభివృద్ధి బోర్డు (ఎన్ఎస్‌టిఇడిబి) కు చెందిన కవాచ్ 2020 (అంచిం అఊ 2020 ) నిధులను పొంది, వ్యవస్థాపకత అభివృద్ధి కేంద్రం (వెంచర్ సెంటర్), పూణెలో ఇన్‌క్యుబేట్ (శిక్షణ, సహాయలు) పొందింది. వారు బంకగా ఉండే సిల్వర్ సొల్యూషన్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్ ను అభివృద్ధి చేశారు. ప్రతికూల వైరల్ స్ట్రాండ్ ఆర్ ఎన్ ఎ, వైరల్ స్ఫోటన సంశ్లేషణను నివారించేందుకు సిల్వర్ నానోపార్టికల్స్ సామర్థ్యంపై ఈ సాంకేతిక పని చేస్తుంది. అధ్యయన ఫలితాల గురించి వేం విశ్వాసంతో ఉన్నాం, సిడిఎస్‌సిఒ, ఇండియా నుంచి మా హ్యాండ్ శానిటైజర్ సూత్రీకరణకు లైసెన్స్ కోసం వేచి ఉన్నాం. ఇటువంటి ఆవిష్కరణలు భారత్ ను ఆత్మనిర్భర్ మిషన్ దిశగా ముందుకు తీసుక ువెళ్లి, భవిష్యత్తులో ఇటువంటి మహమ్మారిని ఎదుర్కొనేందుకు భారత్ ను స్వీయ సమృద్ధి కలిగిన దేశంగా చేస్తుందని విశ్వసిస్తున్నామని, వియ్ఇన్నొవేట్ బయోసొల్యూషన్స్ సిఒఒ ఒ సహవ్యవస్థాపకురాలు, ఇంజినీర అయిన డాక్టర్ అనుపమ అన్నారు. హెచ్ఐవి, హెపటైటిస్ బి, హెర్పిస్, సింప్లెక్స్ వైరస్, ఇన్ఫ్లుయెంజా వైరస్ వంటి అనేక ప్రమాదకర వైరస్‌లపై ప్రభావవంతమైన యాంటీవైరల్ గా తీవ్రమైన ప్రభావాన్ని సిల్వర్ నానోపార్టికల్స్ చూపుతాయని రుజువైంది. ప్రతికూల వైరల్ స్ట్రాండ్ ఆర్ ఎన్ ఎ, వైరల్ స్ఫోటన సంశ్లేషణను అడ్డుకోవడం ద్వారా కరోనావైరస్ విస్తరణను నిరోధించడంలో గ్లైతియోన్ క్యాప్డ్ – ఎజి2 ఎస్ ఎన్‌సిలు (సిల్వర్ నానోక్లస్టర్లు) పాత్ర ఉన్నట్టుగా ఇటీవలి కాలంలో వెలువడిన అనేక నివేదికలు సూచించాయి. ఉపరిత గ్లైకో ప్రోటీన్లను అడ్డుకోవడం ద్వారా అంటు వ్యాధులను, ఆర్ ఎన్ ఎ ప్రతిరూప కల్పనను నిరోధించడం ద్వారా కోవిడ్ 19 వ్యాప్తిని పరిమితం చేయడంలో వియ్ఇన్నొవేట్ బయోసొల్యూషన్స్ శానిటైజర్ల సాంకేతికత ఆధారపడిన కొలైడల్ సిల్వర్ సాయపడు తుంది. వివిధ రకాల వైరస్‌లపై హ్యాండ్ శానిటైజర్ల ప్రభావాన్ని అంచనా వేసేందుకు ఈ సంస్థ ప్రస్తుతం అధ్యయనాన్ని నిర్వహిస్తోంది.

## అత్యధిక టర్నోవర్‌ను నమోదు చేసిన ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) 2020-21

న్యూఢిల్లీ, జూన్ 17:కొవిడ్ –19 మహమ్మారి పూర్తిగా దెబ్బతిన్న సంవత్సరంలో కూడా ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) అత్యధిక టర్నోవర్‌ను నమోదు చేసింది. 2020–21 సంవత్సరంలో కెవిఐసి స్థూల వార్షిక టర్నోవర్‌ను రూ. 95,741.74 కోట్లు. 2019–20లో అది రూ.88,887 కోట్ల టర్నోవర్. తద్వారా 7.71% పెరుగుదల నమోదైంది.

గత ఏడాది మార్చి 25 న ప్రకటించిన దేశవ్యాప్త లాక్‌డౌన్ సందర్భంగా మూడు నెలలకు పైగా ఉత్పత్తి కార్యకలాపాలు నిలిపివేయబడినందున 2020–21లో కెవిఐసి రికార్డ్ పనితీరు గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ కాలంలో అన్ని ఖాదీ ఉత్పత్తి యూనిట్లు మరియు అమ్మకపు దుకాణాలు కూడా మూసివేయబడ్డాయి. ఇవి ఉత్పత్తి మరియు అమ్మకాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఏది ఏమయినప్పటికీ, "ఆత్మనిర్భర్ భారత్" మరియు "వోకల్ ఫర్ లోకల్" కొరకు గౌరవనీయ ప్రధానమంత్రి పిలుపు మేరకు కెవిఐసి వేగంగా పెరిగింది. సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ యొక్క వినూత్న మార్కెటింగ్ ఆలోచనలు కెవిఐసి యొక్క ఉత్పత్తి శ్రేణిని మరింత వైవిధ్యపరిచాయి. స్థానిక ఉత్పత్తిని పెంచాయి. తద్వారా ఖాదీ యొక్క వరుస వృద్ధికి మార్గం సుగమం చేశాయి.

2015–16 సంవత్సరంతో పోల్చితే 2020–21లో ఖాదీ, గ్రామ పరిశ్రమ రంగాలలో మొత్తం ఉత్పత్తి 101% వృద్ధిని నమోదు చేయగా, ఈ కాలంలో స్థూల అమ్మకాలు 128.66% పెరిగాయి.

ఖాదీ ఈ–పోర్టల్, ఖాదీ మాస్కులు, ఖాదీ పాదరక్షలు, ఖాదీ ప్రకృతి పెయింట్, ఖాదీ హ్యాండ్ శానిటైజర్స్ మొదలైనవి రికార్డు స్థాయిలో కొత్త పిఎమ్ఇజిపి యూనిట్ల ఏర్పాటు, కొత్త ఎస్ఎఫ్‌యుఆర్‌టి క్లస్టర్‌లు, ప్రభుత్వ చేపట్టిన "స్వదేశీ" వంటి కార్యక్రమాలు మరియు సదుపాయాల సరఫరా కోసం పారామిలిటరీ దళాలతో కెవిఐసి యొక్క చారిత్రాత్మక ఒప్పందాలు మహమ్మారి సమయంలో గ్రామ పరిశ్రమల టర్నోవర్‌ను పెంచాయి. ఉత్పత్తితో పోలిస్తే రూ. 2019–20లో రూ 65,393.40 కోట్లు, గ్రామ పరిశ్రమ రంగంలో ఉత్పత్తి 2020–21లో రూ. 70,329.67 కోట్లు. అదేవిధంగా, 2020–21 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలు రూ. 92,214.03 కోట్లు. 2019–20లో 84,675.29 కోట్లు.

అయితే దేశవ్యాప్తంగా స్పిన్నింగ్ మరియు నేత కార్యకలాపాలు మహమ్మారి సమయంలో పెద్ద విజయాన్ని సాధించడంతో ఖాదీ రంగంలో ఉత్పత్తి మరియు అమ్మకాలు కొద్దిగా తగ్గాయి. 2020–21లో ఖాదీ రంగంలో మొత్తం ఉత్పత్తి రూ. 1904.49 కోట్లు. 2019–20లో రూ. 2292.44 కోట్లు కాగా, మొత్తం ఖాదీ అమ్మకాలు రూ. 3527.71 కోట్లు. అంతకుముందు సంవత్సరంలో ఇది రూ. 4211.26 కోట్లు.

కెవిఐసి ఛైర్మన్ శ్రీ వినయ్ కుమార్ సక్సేనా మాట్లాడుతూ మహమ్మారి సమయంలో ప్రజలు "ఆత్మనిర్భర్ భారత్" మరియు "వోకల్ ఫర్ లోకల్" పిలుపులకు ఉత్సాహంగా స్పందించారు. ఈ కాలంలో చేతివృత్తులవారికి మరియు నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి కల్పించడమే కెవిఐసి యొక్క ప్రధాన దృష్టి అని ఆయన అన్నారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న యువకులు పిఎమ్ఇజిపి కింద స్వయం ఉపాధి మరియు ఉత్పాదక కార్యకలాపాలను చేపట్టారు. ఇది గ్రామ పరిశ్రమ రంగంలో ఉత్పత్తిని పెంచింది. అదే సమయంలో స్వదేశీ ఉత్పత్తులను కొనాలని ప్రధాని పిలుపు నిచ్చిన తరువాత ఖాదీ మరియు గ్రామ పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి అని తెలిపారు.

# పిఎమ్ కేర్స్ ద్వారా పశ్చిమ బంగాల్ లోని ముర్శిదాబాద్‌లోను, కల్యాణిలోను 250 పడకలతో రెండు కోవిడ్ ఆసుపత్రులు

న్యూఢిల్లీ, జూన్ 15:పశ్చిమ బంగాల్ లోని ముర్శిదాబాద్ లో, కల్యాణి లో 250 పడకల తో ఉండే రెండు తాత్కాలిక కోవిడ్ ఆసుపత్రుల ను డిఆర్‌డిఒ ద్వారా ఏర్పాటు చేయడం కోసం 41.62 కోట్ల రూపాయల ను కేటాయించాలని ప్రైమ్ మినిస్టర్స్ సిటిజన్ అసిస్టెన్స్ ఎండ్ రిలీఫ్ ఇన్ ఇమర్జె?న్సి సిట్యువేశన్స్ (పిఎమ్ కేర్స్) ఫండ్ ట్రస్టు నిర్ణయించింది. దీనికోసం భారత ప్రభుత్వ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తో పాటు ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా మౌలిక సదుపాయాల సంబంధిత మద్ధతు ను కొంత వరకు సమకూర్చడం జరుగుతుంది.

కోవిడ్ స్థితి ని ప్రభావవంతమైన విధం గా నిర్వహించడానికి పశ్చిమ బంగాల్ లో ఆరోగ్య రంగ మౌలిక సదుపాయాల ను ఈ ప్రతిపాదన పెంచనుంది.

ప్రైమ్ మినిస్టర్స్ సిటిజన్ అసిస్టెన్స్ ఎండ్ రిలీఫ్ ఇన్ ఇమర్జె?న్సి సిట్యువేశన్స్ (పిఎమ్ కేర్స్) ఫండ్ ట్రస్టు ఆరోగ్య రంగ మౌలిక సదుపాయాల కల్పన ను అభివృద్ధి పరచడం లో తన వంతు తోడ్పాటు ప్రయాసల లో భాగం గా బిహార్, దిల్లీ, జమ్ము, శ్రీనగర్ లలో సైతం కోవిడ్ ఆసుపత్రుల ఏర్పాటు లో సాయాన్ని అందించింది.

# ఈ నెల 18న 'కోవిడ్-19 ఫ్రంట్ లైన్ వర్కర్స్ కోసం ఉద్దేశించిన క్రాష్ కోర్సు'ను ప్రారంభించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 15:'కోవిడ్–19 ఫ్రంట్ లైన్ వర్కర్స్ కు ఉద్దేశించిన క్రాష్ కోర్సు' కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెల 18 న ఉదయం 11 గంటల కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రారంభించనున్నారు. దీనితో 26కు పైగా రాష్ట్రాల లో విస్తరించి ఉన్న 111 శిక్షణ కేంద్రాల లో ఈ కార్యక్రమం మొదలవుతుంది. ఈ కార్యక్రమం అనంతరం ప్రధాన మంత్రి ప్రసంగం ఉంటుంది. నైపుణ్యాభివృద్ధి, నవపారిశ్రామికత్వ కేంద్ర మంత్రి కూడా ఈ కార్యక్రమం లో పాలుపంచుకొంటారు.

దేశవ్యాప్తం గా ఒక లక్ష మంది కి పైగా కోవిడ్ యోధుల కు నైపుణ్యాల ను సంతరించడం తో పాటు, వారి ప్రావీణ్యాల కు మెరుగులు దిద్దాలన్నది ఈ కార్యక్రమం ధ్యేయం గా ఉంది. హోం కేర్ సపోర్టు, బేసిక్ కేర్ సపోర్టు, అడ్వాన్స్ డ్ కేర్ సపోర్టు, ఎమర్జెన్సీ కేర్ సపోర్టు, నమూనా సేకరణ పరమైన మద్ధతు, వైద్య చికిత్స సంబంధిత సామగ్రిపరమైన మద్ధతు అనేటటువంటి ఆరు ప్రత్యేక నిధుల నిర్వహణ లో కోవిడ్ యోధుల కు శిక్షణ ను ఇవ్వడం జరుగుతుంది.

ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 3.0 లో సెంట్రల్ కాంపొనంట్ లో భాగం గా మొత్తం 276 కోట్ల రూపాయల ఆర్థిక వ్యయం తో ఒక ప్రత్యేక కార్యక్రమం వలె ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. ఆరోగ్య రంగం లో ప్రస్తుత కాలం లోను, భవిష్యత్తు కాలం లోను ఏర్పడే అవసరాల ను తీర్చడానికి నైపుణ్యం కలిగిన వైద్య చికిత్సేతర ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల ను సుశిక్షితులు గా చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం గా ఉంది.

# కరోనా అన్ని వేరియంట్లపై సమర్థవంతంగా పని చేస్తున్న 2డీజీ

హైదరాబాద్ , జూన్ 17:డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన కరోనా డ్రగ్ 2–డీయోక్సీ–డీ–గ్లూకోస్ (2డీజీ) అన్ని రకాల కరోనా వేరియంట్లపై సమర్థవంతంగా పని చేస్తున్నట్లు తాజాగా కొత్త అధ్యయనంలో తేలింది. డ్రగ్ సార్స్–కోవ్–2 వైరస్ మల్టిఫికేషన్‌ను తగ్గిస్తుందని కొత్త అధ్యయనం పేర్కొంది. కణాల్లో వైరస్ విస్తృతిని తగ్గించడమే కాకుండా దాని తీవ్రతను తగ్గించడం ద్వారా కణాలు మృతి చెందకుండా చేయగలదని అధ్యయనంలో వెల్లడైంది. 2డీజీ డ్రగ్ కణాల్లో సంక్రామ్యత ప్రేరిత సైటోపతిక్ ప్రభావాన్ని (సీపీఈ) తగ్గించడంతో పాటు తొలగింపును నిరోధిస్తుందని గుర్తించారు. జూన్ 15 న ప్రచురించబడిన ఆయన అధ్యయనం ఇంకా పరిశీలించబడలేదు. దీనిని అనంత్ నారాయణ్ భట్, అభిషేక్ కుమార్, యోగేశ్ రాయ్, దివియా వేదగిరి తదితరులు ఈ అధ్యయన నివేదికను తయారు చేశారు

కాగా, కరోనా బారినపడి మృత్యువుతో పోరాడేవారికి ఈ ఔషధం బాగా పనిచేస్తున్నట్లు క్లినికల్ ట్రయల్స్‌లో తేలింది. కోవిడ్ ప్రభావం మధ్యస్థం నుంచి తీవ్రంగా ఉండే రోగుల శరీరంలో ఆక్సిజన్ స్థాయి పడిపోకుండా 2డీజీ డ్రగ్ కాపాడుతుంది. డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా మే 1న దీనికి అత్యవసర అనుమతులు మంజూరు చేసింది.

మే 19న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ ఈ డ్రగ్‌ను అధికారికంగా విడుదల చేశారు. 2డీజీ డ్రగ్ వాడిన తర్వాత వైరస్ వృద్ధి చెందడం తగ్గుతున్నట్లు వైద్య నిపుణులు నిర్ధారించారు. సాచెట్ ప్యాకెట్ రూపంలో ఇది మార్కెట్‌లోకి రానుంది. దీని ధరను ఒక్కో సాచెట్ రూ.990గా నిర్ణయించారు. దీన్ని మంచినీళ్లలో కలుపుకుని తాగిన వెంటనే అది పనిచేయడం మొదలుపెడుతుంది. క్లినికల్ ట్రయల్స్‌లో దీన్ని వాడిన రోగులు త్వరగా కొవిడ్ బారి నుంచి కోలుకున్నారు.

క్లినికల్ ట్రయల్స్‌లో వెల్లడైన వివరాల ప్రకారం? కోవిడ్‌తో ఆస్పత్రిపాలైన పేషెంట్లకు 2డీజీ డ్రగ్ ఇవ్వడం ద్వారా వారు త్వరగా కోలుకుంటారు. సాధారణంగా కోవిడ్ పేషెంట్ వ్యాధి నుంచి కోలుకోవడానికి పట్టే సమయం కంటే? ఈ డ్రగ్ తీసుకోవడం ద్వారా రెండున్నర రోజుల ముందే కోలుకుంటారు. అలాగే పేషెంట్‌కు బయటినుంచి ఆక్సిజన్ అందించాల్సిన అవసరం 40 శాతం తగ్గుతుంది. ఈ డ్రగ్ వైరస్ వ్యాపించిన కణాలకు గ్లూకోజ్ అందకుండా చేయడం ద్వారా వైరస్ ప్రభావాన్ని తగ్గిస్తుందని తెలింది.

# కుంభమేళా కరోనా టెస్టింగ్ స్కామ్: ఓ సంస్థ, రెండు ల్యాబ్స్‌పై కేసు

డెహ్రాడూన్, జూన్ 17:ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో ఏప్రిల్ నెలలో జరిగిన మహా కుంభమేళాలో కరోనా టెస్టింగ్ కుంభకోణానికి సంబంధించి రెండు ప్రైవేట్ ల్యాబ్‌లతోపాటు మాక్స్ కార్పొరేట్ ఏజెన్సీపై కేసు నమోదైంది. నెల రోజులపాటు జరిగిన ఈ కుంభమేళాకు దేశం నలుమూలల నుంచి సుమారు 70 లక్షల మంది భక్తులు హాజరై పవిత్ర గంగా నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా హరిద్వార్‌లో అనుమతించిన 22 ల్యాబ్స్ సుమారు 2.5 లక్షలకుపైగా భక్తులకు కరోనా పరీక్షలు నిర్వహించాయి. అయితే కేవలం 2,500 మందికి మాత్రమే పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కాగా, చాలా మంది భక్తుల ఐడీ కార్డు, మొబైల్ నంబర్ ఆధారంగా లక్షకుపైగా నకిలీ కరోనా ఫలితాలను పలు ల్యాబ్స్ ఇచ్చినట్లు వెలుగుచూసింది. దీనిపై హరిద్వార్ పాలనా యంత్రాంగం గత వారం దర్యాప్తునకు ఆదేశించింది. చాలా ల్యాబ్స్ నకిలీ కరోనా టెస్ట్ రిపోర్టులు ఇచ్చాయని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. బుధవారం మరో దర్యాప్తునకు ఆదేశించారు.

ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ గురువారం నగర్ కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఈ స్కామ్‌పై ఫిర్యాదు చేసింది. మాక్స్ కార్పొరేట్ ఏజెన్సీతో పాటు లాల్‌చందాని ల్యాబ్స్, నల్వా ల్యాబ్‌కు వ్యతిరేకంగా ఆరోపణలు చేయడంతో వీటిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు హరిద్వార్ సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ సెంథిల్ అబుదై కృష్ణరాజ్ తెలిపారు. మరోవైపు కుంభమేళా కరోనా టెస్టింగ్ స్కామ్ నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం తీరత్ సింగ్ రావత్ హెచ్చరించారు.

## జియోగ్రాఫికల్ ఇండికేషన్ ధ్రువీకరణ కలిగిన జల్గావ్ అరటి దుబాయికి ఎగుమతి చేయబడింది.

న్యూఢిల్లీ, జూన్ 17:జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ధ్రువీకరణ పొందిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ప్రోత్సాహకంగా ఫైబర్, మినరల్స్ పుష్కలంగా ఉన్నజల్గావ్ అరటిపండ్లను దుబాయికి ఎగుమతి చేశారు.

మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలోగల తాండల్వాడి గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతుల నుంచి ఇరవై రెండు మెట్రిక్ టన్నుల జియోగ్రాఫికల్ ధ్రువీకరణ కలిగిన జల్గావ్ అరటిని వ్యవసాయ ఎగుమతి విధానం కింద గుర్తించారు.

2016 లో జల్గావ్ అరటికి జియోగ్రాఫికల్ ధ్రువీకరణ లభించింది. జల్గావ్లోని నిసర్గరాజ కృషి విజ్ఞాన కేంద్ర(కేవీకే)లో ఇది నమోదు చేయబడింది. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అవలంభించడం వల్ల భారతదేశం యొక్క అరటి ఎగుమతి వేగంగా పెరుగుతోంది.

భారతదేశం 2018?19లో రూ.413కోట్లు విలువచేసే 1.34లక్షల మెట్రిక్ టన్నుల అరటిని ఎగుమతి చేయగా.. 2019?20 నాటికి రూ.660కోట్లు విలువ చేసే 1.95మెట్రిక్ టన్నులకు పెరిగాయి. 2020?21వ సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకు రూ.619 కోట్లు విలువ చేసే 1.91 లక్షల మెట్రిక్ టన్నుల అరటిని భారత్ ఎగుమతి చేసింది.

అరటి ఉత్పత్తుల్లో 25 శాతం వాటాతో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. దేశం అరటి ఉత్పత్తిలో 70శాతానికిపైగా ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, ఉత్తర ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఉత్పత్తి అవుతోంది.

వ్యవసాయ ఉత్పత్తులకు, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులను ఏపీఈడీఏ ప్రోత్సహిస్తోంది. మౌలిక వసతులు అభివృద్ధి, నాణ్యతా ప్రమాణాల అభివృద్ధి, మార్కెటింగ్ అభివృద్ధి పథకాల ద్వారా ఎగుమతులకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తోంది. అంతేకాకుండా వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడానికి దిగుమతి చేసుకునే దేశాలతో, అంతర్జాతీయ కొనుగోలుదారులు, అమ్మకందారులతో వర్చువల్ వాణిజ్య కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

ఇవే కాకుండా వాణిజ్య మౌలిక సదుపాయాల కల్పన, మార్కెట్ యాక్సెస్ ఇనిషియేటివ్ వంటి పథకాల ద్వారా వాణిజ్యశాఖ కూడా వాణిజ్య శాఖ కూడా ఎగుమతులను ప్రోత్సహిస్తోంది.

## రెండు తాత్కాలిక కోవిడ్ ఆసుపత్రులను పిఎమ్ కేర్స్ ద్వారా ఏర్పాటు

న్యూఢిల్లీ, జూన్ 17:పశ్చిమ బంగాల్ లోని ముర్షిదాబాద్ లో, కల్యాణి లో 250 పడకల తో ఉండే రెండు తాత్కాలిక కోవిడ్ ఆసుపత్రుల ను డిఆర్‌డిఒ ద్వారా ఏర్పాటు చేయడం కోసం 41.62 కోట్ల రూపాయల ను కేటాయించాలని ప్రైమ్ మినిస్టర్స్ సిటిజన్ అసిస్టెన్స్ ఎండ్ రిలీఫ్ ఇన్ ఇమర్జ?న్సి సిట్యువేశన్స్ (పిఎమ్ కేర్స్) ఫండ్ ట్రస్టు నిర్ణయించింది. దీనికోసం భారత ప్రభుత్వ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తో పాటు ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా మౌలిక సదుపాయాల సంబంధిత మద్దతు ను కొంత వరకు సమకూర్చడం జరుగుతుంది.

కోవిడ్ స్థితి ని ప్రభావవంతమైన విధం గా నిర్వహించడానికి పశ్చిమ బంగాల్ లో ఆరోగ్య రంగ మౌలిక సదుపాయాల ను ఈ ప్రతిపాదన పెంచనుంది.

ప్రైమ్ మినిస్టర్స్ సిటిజన్ అసిస్టెన్స్ ఎండ్ రిలీఫ్ ఇన్ ఇమర్జ?న్సి సిట్యువేశన్స్ (పిఎమ్ కేర్స్) ఫండ్ ట్రస్టు ఆరోగ్య రంగ మౌలిక సదుపాయాల కల్పన ను అభివృద్ధి పరచడం లో తన వంతు తోడ్పాటు ప్రయాసల లో భాగం గా బిహార్, దిల్లీ, జమ్ము, శ్రీనగర్ లలో సైతం కోవిడ్ ఆసుపత్రుల ఏర్పాటు లో సాయాన్ని అందించింది.

## కేసీఆర్ పై నిప్పులు చెరిగిన షర్మిల

న్యూఢిల్లీ, జూన్ 17:నిరుద్యోగులంటే సీఎం కేసీఆర్ కు ఎందుకు ఇంత కక్ష అని ప్రశ్నించారు వైఎష్ షర్మిల. తెలంగాణలో ఉద్యోగ నోటిషికేషన్లు లేక ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని పరామర్శించేందుకు హుజూర్ నగర్ కు నిన్న వెళ్లారు. అయితే, యువకుడి ఇంటికి తాళం వేసి ఉండడంతో ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తనను కలవ వద్దని టీఆర్ఎస్ నేతలు బాధిత యువకుడి కుటుంబాన్ని బెదిరించారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 1200 మంది ప్రాణత్యాగం చేశారని, వారి కుటుంబాలను ఆదుకుంటామన్న కేసీఆర్ ఆ తర్వాత ఆ ఊసే మర్చిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఎమ్మెల్యే సీటు ఖాళీ అయితే, ఆగమేఘాల మీద మంత్రులను, నాయకులను పంపించి.. మళ్లీ ఆ సీటు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పక్క పార్టీల ఎమ్మెల్యే ఎంత డబ్బులు ఇచ్చి అయినా కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.

ప్రతీకార రాజకీయాల కోసం సీఎం కేసీఆర్ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. స్వార్ధ రాజకీయాల కోసం వేగంగా పని చేసే కేసీఆర్? యువత భవిష్యత్ ను ఎందుకు దృష్టిలో పెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. ఉద్యోగ నోటిఫికేషన్ లు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. నిరుద్యోగ ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేలని వ్యాఖ్యానించారు. నిరుద్యోగులు ఎవ్వరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగుల తరుపున తాను కొనసాగిస్తానని, అండగా ఉంటానని షర్మిల చెప్పారు. గతంలో వైఎస్ఆర్ సీఎంగా ఉన్న ఐదేళ్లలో లక్షలకుపైగా ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. 2008లో జంబో డీఎస్సీ పేరుతో ఒకేసారి 50 వేల పోస్టు భర్తీ చేశారని చెప్పారు. అంతేకాదు ప్రైవేట్ పరంగా దాదాపు 11 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. టీఆర్ఎస్ ఏడేళ్లల పాలనలో ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..!!



- మున్సిపాలిటీ అధికారులకు సూచించిన అదనపు కలెక్టర్ రాజార్షీ షా.

సంగారెడ్డి, జూన్ 17(నేటినిజం ప్రతినిధి) గురువారం సంగారెడ్డి మునిసిపాలిటీలో ఉదయం పారిశుద్ధ్య నిర్వహణ ను జిల్లా అదనపు కలెక్టర్ రాజార్షి ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రైతు బజార్ మార్కెట్ యార్డ్‌ను సందర్శించి కూరగాయల అమ్మకందారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డ్ లో గల లోతట్టు ప్రాంతాలను వెంటనే మొరంతో నింపాలని మున్సిపల్ కమిషనర్, మునిసిపల్ ఇంజనీర్ లకు సూచించారు.

అనంతరం పోతిరెడ్డిపల్లి రోడ్డు నంబర్ రెండు లో లోతట్టు ప్రాంతంలో నీరు నిలుస్తుందని స్థానికుడు చేసిన ఫిర్యాదు మేరకు,అట్టి స్థలాన్ని సందర్శించి నీరు నిలువకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. వెంటనే మునిసిపల్ అధికారులు దానిని సి అండ్ డి వ్యర్థ పదార్థాలతో పూడ్చి వేసారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతిరెడ్డిపల్లి వద్ద మురుగుకాలవ మార్గం వర్షాకాలంలో నీటి ప్రవాహానికి సరిపోవడం లేదని తెలిపారు. స్థానిక కౌన్సిలర్, వైస్ చైర్మన్ కాలువ పనులకు ఐదు లక్షలు మంజూరు అయ్యాయని అదనపు కలెక్టర్కు తెలిపారు. మంజూరైన నిధులు సరిపోవని, పనుల పూర్తికి మరిన్ని నిధులు అవసరమని చెప్పగా, నిధుల కోసం చూడకుండా తక్షణమే పనులను ప్రారంభించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

హరితహారం లో భాగంగా

పోతిరెడ్డిపల్లి నుండి సంగారెడ్డి ప్రధాన రహదారి , పోతిరెడ్డిపల్లి నుండి కంది జాతీయ రహదారి మీద చేపడుతున్న అవెన్యూ ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ రామప్ప, మేనేజర్ మిర్జా ఫసహత్ అలీ బేగ్, మునిసిపల్ ఇంజనీర్, శానిటరీ ఇన్స్పెక్టర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్,తదితరులు పాల్గొన్నారు.

## అంతరాయం అంటే నిరాశ అని అర్థం కాదు, మరమ్మత్తు మరియు సన్నద్ధత అనే జంట పునాదులపై మనం దృష్టి పెట్టాలి : ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 17:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఈ రోజు, వివాటెక్ 5వ ఎడిషన్‌లో, దృశ్య మాధ్యమం ద్వారా కీలకోపన్యాసం చేశారు. ఐరోపాలో అతిపెద్ద డిజిటల్ మరియు అంకురసంస్థల కార్యక్రమాల్లో ఒకటిగా నిర్వహిస్తున్న, వివాటెక్-2021 లో కీలకోపన్యాసం చేయడానికి ప్రధానమంత్రి ని గౌరవ అతిథిగా ఆహ్వానించారు. 2016 నుండి ప్రతి సంవత్సరం పారిస్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, భారత్, ఫ్రాన్స్ దేశాలు విస్తృత విషయాలపై నిశితంగా పనిచేస్తున్నాయని చెప్పారు. వీటిలో, సాంకేతికత మరియు డిజిటల్ అంశాలు ఈ సహకారం లో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలుగా ఉన్నాయి. ఇలాంటి సహకారం మరింత పెరగాల్సిన అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉంది. ఇది మన దేశాలకు మాత్రమే కాదు, మొత్తం ప్రపంచ దేశాలకు కూడా పెద్దగా సహాయపడుతుందని, ఆయన పేర్కొన్నారు. అటోస్, క్యాప్ జెమినీ వంటి ఫ్రెంచ్ కంపెనీ ల సహకారం తో ఇన్ఫోసిస్ సంస్థ, ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ పోటీల కు సాంకేతిక సహాయం అందించిందనీ, అదేవిధంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలు మరియు పౌరులకు సేవలందిస్తున్న రెండు దేశాల ఐ.టి. ప్రతిభకు భారతదేశ టి.సి.ఎస్. మరియు విప్రో సంస్థలు కూడా ఉదాహరణలుగా నిలిచాయని, శ్రీ మోదీ, వివరించారు.

సంప్రదాయం విఫలమైన చోట, ఆవిష్కరణ సహాయపడుతుందని ప్రధానమంత్రి, అభిప్రాయపడ్డారు. మహమ్మారి సమయంలో, డిజిటల్ టెక్నాలజీ మాకు ఎదుర్కోవటానికి, కనెక్ట్ చేయడానికి, సౌకర్యం మరియు కన్సోల్ చేయడానికి సహాయపడింది. మహమ్మారి సమయంలో మనం భరించటానికి, అనుసంధానం కావడానికి, సౌకర్యాలు పొందడానికి, ఓదార్పు పొందడానికి, డిజిటల్ సాంకేతికత సహాయపడిందని, ప్రధానమంత్రి చెప్పారు. భారతదేశ సార్వత్రిక, ప్రత్యేకమైన బయో మెట్రిక్ డిజిటల్ గుర్తింపు వ్యవస్థ - ఆధార్ - పేదలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించడానికి సహాయపడిందని, ఆయన తెలియజేశారు. "మేము 800 మిలియన్ల ప్రజలకు ఉచిత ఆహారాన్ని సరఫరా చేయగలిగాము. అదేవిధంగా అనేక కుటుంబాలకు వంట-గ్యాస్ రాయితీలను అందించగలిగాము. భారతదేశంలో మేము విద్యార్థులకు సహాయపడటానికి - స్వయం మరియు దీక్ష - అనే రెండు ప్రభుత్వ డిజిటల్ విద్యా కార్యక్రమాలను, చాలా తక్కువ సమయంలో అమలు చేయగలిగాము.", అని ప్రధానమంత్రి చెప్పారు.

మహమ్మారి సవాలును ఎదుర్కోవడంలో అంకుర సంస్థల రంగం నిర్వహించిన పాత్ర ను ప్రధానమంత్రి ప్రశంసించారు. పి.పి.ఇ.ఈ. కిట్లు, మాస్కులు, పరీక్షలు చేయడానికి వినియోగించే వస్తు సామగ్రి కొరత ను తీర్చడంలో ప్రైవేటు రంగం కీలక పాత్ర పోషించింది. కొన్ని కోవిడ్ మరియు కోవిడ్ కాని ఇతర సమస్యలను దృశ్య మాధ్యమం ద్వారా పరిష్కరించడానికి వైద్యులు టెలి-మెడిసిన్ విధానాన్ని పెద్ద ఎత్తున ఉపయోగించారు. భారతదేశంలో రెండు టీకాలు తయారు చేయడం జరిగింది. మరిన్ని టీకాలు, అభివృద్ధి లేదా పరీక్ష దశలో ఉన్నాయి. స్వదేశీ ఐ.టి. యాప్, "ఆరోగ్య-సేతు" కాంటాక్ట్-ట్రేసింగ్ ను సమర్థవంతంగా ప్రారంభించిందని, ప్రధానమంత్రి, తెలియజేశారు. అదేవిధంగా, "కోవిన్" యాప్ కూడా ఇప్పటికే లక్షలాది మందికి టీకా సమాచారం అందించడంలో, నమోదు చేయడంలో సహాయపడుతోంది.

ప్రపంచంలోనే అతిపెద్ద అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థలలో భారతదేశం ఒకటి అని, ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాలలో అనేక ప్రత్యేకమైన (యునికార్న్) సంస్థలు ప్రారంభమయ్యాయి. ఆవిష్కర్తలు మరియు పెట్టుబడిదారులకు అవసరమైన వాటిని భారతదేశం అందిస్తోంది. ప్రతిభ, మార్కెట్, మూలధనం, పర్యావరణ వ్యవస్థ, బహిరంగ సంస్కృతి అనే ఐదు స్తంభాల ఆధారంగా భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలని, ఆయన, ఈ సందర్భంగా, ప్రపంచ దేశాలను ఆహ్వానించారు. భారతీయ ప్రతిభా పాటవాలు, మొబైల్ ఫోన్ల వినియోగం, ఏడు వందల డెబ్బై ఐదు మిలియన్ల ఇంటర్నెట్ వినియోగదారులు, ప్రపంచంలో అత్యధిక మరియు చౌకైన డేటా వినియోగంతో పాటు, సామాజిక మాధ్యమాన్ని అత్యధికంగా ఉపయోగించడం వంటి అంశాలు, పెట్టుబడిదారులను భారతదేశానికి ఆహ్వానించడానికి దోహదపడతాయని కూడా, ప్రధానమంత్రి నొక్కి చెప్పారు.

ప్రజలకు అందుబాటులో అత్యాధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఐదు వందల ఇరవై మూడు వేల కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్, లక్షా యాభై ఆరు వేల గ్రామ స్థాయి మండళ్ళు, దేశవ్యాప్తంగా ప్రజలకు అందుబాటులో వై-ఫై నెట్‌వర్క్ వంటి అనేక కార్యక్రమాల గురించి కూడా ప్రధానమంత్రి వివరించారు. ఆవిష్కరణల సంస్కృతి ని పెంపొందించే ప్రయత్నాలను కూడా ఆయన ఈ సందర్భంగా వివరించారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ పథకం కింద ఏడు వేల ఐదు వందల పాఠశాలల్లో అత్యాధునిక ఇన్నోవేషన్ ప్రయోగశాల లు ఏర్పాటు చేసినట్లు ప్రధానమంత్రి తెలియజేశారు.

గత ఏడాది, వివిధ రంగాలలో జరిగిన అంతరాయం గురించి ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, అంతరాయం అంటే నిరాశ అని అర్థం చేసుకోకూడదని, అందుకు బదులుగా, మరమ్మత్తు మరియు సన్నద్ధత అనే జంట పునాదులపై మనం దృష్టి పెట్టాలని, వివరించారు. "గత ఏడాది, ఈ సమయానికి, ప్రపంచం ఇంకా టీకాల కోసం ఎదురుచూసే పరిస్థితిలో ఉంది. ఈ రోజు, మనకు చాలా టీకాలు అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా, ఆరోగ్య మౌలిక సదుపాయాల తో పాటు మన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం కొనసాగించాలి. గనుల తవ్వకం, అంతరిక్షం, బ్యాంకింగ్ వ్యవహారాలూ, అణుశక్తి వంటి ఎన్నో రంగాలలో మేము భారతదేశంలో భారీ సంస్కరణలు అమలు చేసాం. మహమ్మారి సమయంలో కూడా, భారతదేశం ఒక దేశంగా, అనువర్తన యోగ్యమైనది మరియు చురుకైనదిగా నిలవడానికి ఇది సహకరించింది." అని శ్రీ మోదీ వివరించారు.

తదుపరి దశ మహమ్మారికి వ్యతిరేకంగా మన భూగోళాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని కూడా ప్రధానమంత్రి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. పర్యావరణ క్షీణతను నిలువరించే, స్థిరమైన జీవన శైలి పై మేము దృష్టి సారించాము. ఆవిష్కరణలతో పాటు పరిశోధనల్లో కూడా సహకారాన్ని బలోపేతం చేస్తున్నాము. ఈ సవాళ్ళను సమిష్టి స్ఫూర్తి తో మరియు మానవ కేంద్రీకృత విధానంతో అధిగమించడానికి, అంకురసంస్థల సమాజం నాయకత్వం వహించి పనిచేయాలని, ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. "అంకుర సంస్థల వ్యవస్థ యువత ఆధిపత్యంలో ఉంది. వీరు గత భారం నుండి విముక్తి పొందిన వ్యక్తులు. ప్రపంచ పరివర్తనకు అవసరమైన శక్తిని పెంపొందించడానికి వీరు చేసే కృషి చాలా ఉత్తమమైనది. ఆరోగ్య సంరక్షణ, వ్యర్థాల పునర్వినియోగం, వ్యవసాయం, నేర్చుకునే కొత్త యుగ సాధనాలు సహా పర్యావరణ అనుకూల సాంకేతికత, వంటి వాటిని, మన అంకుర సంస్థలు తప్పనిసరిగా అన్వేషించాలి", అని ప్రధానమంత్రి సూచించారు. భారతదేశ ముఖ్య భాగస్వాములలో ఫ్రాన్స్ మరియు యూరప్ ఉన్నాయని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. మే నెలలో పోర్టో లో జరిగిన ఈ.యు. నాయకులతో జరిగిన శిఖరాగ్ర సదస్సు సందర్భంగా అధ్యక్షుడు మాక్రాన్ తో తాను జరిపిన సంభాషణలను ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, అంకుర సంస్థల నుండి క్వాంటమ్ కంప్యూటింగ్ వరకు డిజిటల్ భాగస్వామ్యం, ఒక ముఖ్య ప్రాధాన్యతగా ఉద్భవించిందని, పేర్కొన్నారు. "కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో నాయకత్వం ఆర్థిక బలం, ఉద్యోగాలు, శ్రేయస్సును నడిపిస్తున్న విషయాన్ని చరిత్ర రుజువు చేసింది. అయితే, మన భాగస్వామ్యం కూడా, మానవత్వ సేవలో ఒక పెద్ద ప్రయోజనానికి ఉపయోగపడాలి. ఈ మహమ్మారి మన స్థితిస్థాపకత కు మాత్రమే కాదు, మన ఊహ కి కూడా ఒక పరీక్ష. అందరికీ మరింత సమగ్రమైన, శ్రద్ధతో కూడిన స్థిరమైన భవిష్యత్తును నిర్మించుకోడానికి ఇది ఒక అవకాశం", అని పేర్కొంటూ, ప్రధానమంత్రి తమ ప్రసంగాన్ని ముగించారు.

## సముద్ర గర్భంలో అన్వేషణకు మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, జూన్ 17:సముద్ర గర్భంలో లభిస్తున్న వనరులను వెలికి తీసి, సముద్ర వనరులను సుస్థిరంగా వినియోగంలోకి తీసుకుని రావడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ రూపొందించిన ''డీప్ ఓషన్ మిషన్'' పథకానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ఆమోదం తెలిపింది.

దశల వారీగా అయిదు సంవత్సరాలపాటు అమలు జరిగే ఈ మిషన్ కు 4077 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తారు. మొదటిదశను మూడు సంవత్సరాల పాటు (2021-24) 2823.4 కోట్ల రూపాయలతో అమలు చేస్తారు. నీలి విప్లవ సాధనకు కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా "డీప్ ఓషన్ మిషన్" అమలు జరుగుతుంది. దీనిని వివిధ సంస్థల సహకారంతో కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ప్రాధాన్యతా పథకంగా అమలు చేస్తుంది.

### "డీప్ ఓషన్ మిషన్" ఈ కింది ప్రధాన భాగాలను కలిగి ఉంటుంది:

సముద్రంలో ఖనిజాల అన్వేషణ, సముద్ర గర్భంలోకి మానవులను పంపడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చుకోవడం : శాస్త్రీయ సెన్సార్లు, పరికరాలను అమర్చిన సూట్‌తో ముగ్గురు వ్యక్తులను సముద్రంలో 6000 మీటర్ల లోతుకు తీసుకువెళ్లడానికి సబ్మెర్సిబుల్ ను అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఇటువంటి సామర్థ్యాన్ని ప్రపంచంలో కొన్ని దేశాలు మాత్రమే కలిగివున్నాయి. మధ్య హిందూ మహాసముద్రంలో 6000 మీటర్ల లోతు నుంచి ఖనిజ సంపదను వెలికి తీయడానికి సమగ్ర మైనింగ్ వ్యవస్థకు రూపకల్పన చేయడం జరుగుతుంది. ఐక్యరాజ్య సమితికి చెందిన ఇంటర్నేషనల్ సి బెడ్ అథారిటీ ఆమోదించిన తరువాత ఈ ఖనిజ సంపదను వాణిజ్యపరంగా అభివృద్ధి చేస్తారు.

సముద్రంలో చోటుచేసుకునే వాతావరణ మార్పులపై సలహా సేవల అభివృద్ధి: వివిధ కాలాల్లో సముద్రంలో నెలకొనే వాతావరణంతో పాటు పది సంవత్సరాల కాలంలో నెలకొనే వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసి నివేదికలను సిద్ధం చేస్తారు. నీలి విప్లవ సాధనకు ఈ అధ్యయనాలు ఉపకరిస్తాయి.

సముద్ర గర్భంలో జీవవైవిధ్య అన్వేషణ, పరిరక్షణకు సాంకేతిక ఆవిష్కరణలు:: సూక్ష్మజీవులతో సహా సముద్ర గర్భంలో వుండే వృక్ష, జంతుజాలంపై జీవవైవిధ్య పరిశోధనలను నిర్వహించి, సముద్ర వనరులను వినియోగంలోకి తీసుకుని రావడానికి నూతన సాంకేతిక ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఈ ఆవిష్కరణలు నీలి విప్లవ సాధనలో సముద్ర మత్స్యసంపద దాని అనుబంధ సేవలను వినియోగించడానికి అవకాశం కలుగుతుంది.

సముద్ర గర్భ సర్వే, అన్వేషణ : హిందూ మహాసముద్రం, సముద్ర మధ్యలో వుండే కొండలలో లభించే ఖనిజ సంపద అన్వేషణపై ఈ కార్యక్రమంలో ప్రాధాన్యత ఇస్తారు. సముద్ర వనరులను వెలికి తీస్తూ నీలి విప్లవ సాధనకు ఈ అన్వేషణ సహకరిస్తుంది.

సముద్రం నుంచి శక్తి మరియు మంచినీరు: ఆఫ్‌షోర్ ఓషన్ థర్మల్ ఎనర్జీ కన్వర్షన్ శక్తితో పనిచేసే డీశాలినేషన్ ప్లాంట్ కోసం అధ్యయనాలు మరియు వివరణాత్మక ఇంజనీరింగ్ డిజైన్ రూపకల్పనను ఈ ప్రతిపాదనలో చేర్చారు. నీలి విప్లవంలో ఇంధన అభివృద్ధి అంశానికి ఈ ప్రతిపాదన ప్రాధాన్యత ఇస్తుంది.

సముద్ర జీవశాస్త్ర ఆధునిక సౌకర్యాలు: సముద్ర జీవశాస్త్ర రంగంలో మానవ మేధస్సు, ఇంజనీరింగ్ రంగాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో మిషన్ లో ఈ ప్రతిపాదనకు ప్రాధాన్యత ఇస్తారు. పరిశోధనల ఫలితాలను పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించడం, తీరంలో సౌకర్యాలను నెలకొల్పడం జరుగుతుంది. నీలి విప్లవంలో సముద్ర జీవశాస్త్రం , మత్స్య సంపద వ్యాపార ఉత్పత్తి రంగాలకు ఈ ప్రతిపాదన సహకరిస్తుంది.

సముద్ర గర్భంలో ఖనిజ సంపదను వెలికి తీయడం క్లిష్టంగా ఉంటుంది. దీనికి అవసరమైన పరికరాలు వాణిజ్యపరంగా అందుబాటులో లేవు. దీనితో గుర్తింపు పొందిన సంస్థలు, ప్రైవేట్ రంగ సహకారంతో వీటిని స్వదేశంలో అభివృద్ధి చేయడానికి కార్యక్రమాలను అమలు చేస్తారు. సముద్ర గర్భంలో పరిశోధనలను చేపట్టే సామర్థ్యంతో ఒక నౌకను దేశంలోని ఒక షిప్ యార్డులో నిర్మిస్తారు. దీనివల్ల ఆ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ మిషన్ ను అమలు చేయడం వల్ల సముద్ర జీవశాస్త్ర రంగానికి మరింత ప్రాధాన్యత లభిస్తుంది. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ప్రత్యేక పరికరాల నమూనా, అభివృద్ధి, ఉత్పత్తి కార్యక్రమాలు, ప్రత్యేక నౌకల నిర్మాణం లాంటి కార్యక్రమాల వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత అభివృద్ధి సాధిస్తుంది. భారత పారిశ్రామిక రంగం ముఖ్యంగా చిన్న మధ్య తరహా సూక్ష్మ పరిశ్రమల రంగం అభివృద్ధి చెందడానికి అవకాశం కలుగుతుంది. భూగోళంలో 70% ప్రాంతంలో విస్తరించి ఉన్న సముద్రాలు మానవ జీవితంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సముద్ర సంపదలో 95% వరకు సముద్ర గర్భంలోనే నిక్షిప్తం అయి వుంది. మూడువైపులా సముద్రాన్ని సరిహద్దుగా కలిగిన భారతదేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్య సంపద కీలక పాత్ర పోషిస్తోంది. దేశ జనాభాలో 30 శాతం మంది తీర ప్రాంతాల్లో నివసిస్తూ జీవనోపాధికి సముద్ర సంపదపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆహారం, శక్తి, ఖనిజాలు, ఔషధ సంపద కలిగివున్న సముద్రాలు వాతావరణ పరిస్థితుల మార్పుల్లో కీలకంగా మారాయి. సముద్రాల ప్రాధాన్యతను గుర్తించిన ఐక్యరాజ్య సమితి 2021-30 దశాబ్ద కాలాన్ని సుస్థిర అభివృద్ధి సాధనకు సముద్రశాస్త్రాల కాలంగా పరిగణిస్తోంది.

భారతదేశంలో సముద్రాలకు ప్రత్యేక స్థానం ఉంది. 7517 కిలోమీటర్ల పొడవునా తీరప్రాంతం కలిగి ఉన్న భారతదేశంలో తొమ్మిది తీరప్రాంత రాష్ట్రాలు, 1382 దీవులు వున్నాయి. సముద్ర సంపద ప్రాధాన్యతను గుర్తించిన భారత ప్రభుత్వం అభివృద్ధికి దోహదపడే పది అంశాలలో నీలి విప్లవాన్ని కూడా చేర్చింది.

## రహదారుల నెట్ వర్క్‌ను ఆధునీకరించేందుకు వి484 మిలియన్ల రుణ కేటాయింపు ఒప్పందంపై సంతకం చేసిన భారత్, ఎడిబి

న్యూఢిల్లీ, జూన్ 17:తమిళనాడు రాష్ట్రంలో చెన్నై- కన్యాకుమారి పారిశ్రామిక కారిడార్ (సికెఐసి) లో పారిశ్రామిక అభివృద్ధిని సులభతరం చేసేందుకు, రవాణా అనుసంధానతను మెరుగుపరిచేందుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి), భారత ప్రభుత్వం బుధవారం నాడు 484 మిలియన్ డాలర్ల రుణం కేటాయింపు ఒప్పందంపై సంతకాలు చేశాయి.

పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడు వరకు విస్తరించి ఉన్న భారత తూర్పు తీర ఆర్థిక కారిడార్ (ఈస్ట్ కోస్ట్ ఎకనమిక్ కారిడార్ - ఇసిఇసి)లో సికెఐసి భాగం. ఇది దక్షిణ, ఆగ్నేయ, తూర్పు ఆసియాలోని ఉత్పత్తి నెట్ వర్క్‌లతో భారత్ ను అనుసంధానం చేస్తుంది. ఇసిఇసిని అభివృద్ధి చేయడంలో భారత ప్రభుత్వానికి ప్రధాన భాగస్వామిగా ఎడిబి వ్యవహరిస్తోంది.

భారత ప్రభుత్వం తరపున తమిళనాడు పారిశ్రామిక అనుసంధాన ప్రాజెక్టు కోసం ఆర్థిక వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రా సంతకం చేయగా, భారత్ లోని ఎడిబి కంట్రీ డైరెక్టర్ తకో కొనేషీ ఎడిబి తరపున సంతకం చేశారు.

పారిశ్రామిక సదుపాయాలు, రవాణా ప్రవేశద్వారాలు, వినియోగ కేంద్రాల మధ్య నిరాటంకమైన అనుసంధానత పెంచడానికి ఋ ప్రాజెక్టు కీలకం. ఇది సికెఐసి లక్షిత పరిశ్రమల ఉత్పాదక ఖర్చును తగ్గించడమే కాక,లాజిస్టిక్స్‌ను తగ్గించి, వాటి పోటీతత్వాన్ని ప్రోత్సహిస్తుందని, మిశ్రా పేర్కొన్నారు.

ఎడిబి మద్దతుతో సికెఐసి సమగ్రాభివృద్ధి ప్రణాళిక కింద కారిడార్ అభివృద్ధి కోసం గుర్తించిన ప్రాధాన్యత కలిగిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఈ ప్రాజెక్టు ఒకటని కొనోషీ అన్నారు. పారిశ్రామిక వృద్ధి కేంద్రాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన రవాణా, ఇంధన,, పట్టణ మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా పారిశ్రామిక పరివర్తనను ప్రోత్సహించడం అన్నది సంపూర్ణ లక్ష్యమని ఆయన చెప్పారు.

తమిళనాడులోని చెన్నై, కన్యాకుమారి మధ్య గల 32లోని 23 జిల్లాలలో సికెఐసి ప్రభావం గల ప్రాంతాలలో 590 కిమీల రాష్ట్ర హైవేలను ఈ ప్రాజెక్టు ఆధునీకరించనుంది. పారిశ్రామక కేంద్రాల అనుసంధానతను, లోతట్టు ప్రాంతాలు, ఓడరేవులతో పెంచడం అన్నది భారత ఉత్పత్తి రంగం అంతర్జాతీయ ఉత్పత్తి నెట్‌వర్క్‌లలోనూ, గ్లోబల్ విలువ లంకెలలోనూ భాగస్వాములయ్యేందుకు అవకాశాన్ని పెంచి, కారిడార్ పొడవునా ఉద్యోగాలను సృష్టిస్తుంది.

ఎడిబి దీర్ఘకాలిక కార్పొరేట్ వ్యూహమైన, స్ట్రాటజీ 2030కు అనుగుణంగా, ఈ ప్రాజెక్టు స్థిరత్వాన్ని, పర్యావరణ మార్పు స్థితిస్థాపకత, రహదారి భద్రతల పై ప్రాజెక్టు ప్రాముఖ్యతను ఇస్తుంది. రహదారి ప్రాజెక్టుల దీర్ఘకాలిక నిర్వహణ కోసం ఏడు ఏళ్ళ కాంట్రాక్టులను ఇచ్చారు. హైవేల ఆధునీకరణలో మెరుగైన డ్రైనేజీ, కీలకమైన ప్రాంతాలలో రహదారి కరకట్టల ఎత్తు పెంపు, వంతెనలు, కల్వర్టుల కొలతలను మార్చడం సహా పలు వాతావరణ మార్పు అనుసరణ చర్యలను పొందుపరుస్తున్నారు. రహదారి పర్యవేక్షణ, అమలు కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రహదారి భద్రతను మెరుగుపరిచే కార్యక్రమాలను ఈ ప్రాజెక్టు బలోపేతం చేస్తుంది.

అదనంగా, తమిళనాడు హైవేలు, మైనర్ పోర్టుల శాఖ ప్రణాళిక సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రాజెక్టు తోడ్పడుతుంది.

అత్యంత దారిద్ర్యాన్ని నిర్మూలించడం కోసం తమ నిరంతర కృషితో పాటుగా, సంపన్నమైన, కలుపుకుపోయే, బలమైన, పాలనీయ ఆసియా, పసిఫిక్ ప్రాంతాలను సాధించేందుకు ఎడిబి కట్టుబడి ఉంది, 1966లో స్థాపించిన ఈ బ్యాంకు 68 మంది సభ్యులకు చెందింది - ఇందులో 49మంది ఈ ప్రాంతానికి చెందినవారు.

## గుజరాత్‌లోని లోథల్‌లో "జాతీయ సముద్ర వారసత్వ సముదాయం అభివృద్ధికి సహకారం'

న్యూఢిల్లీ, జూన్ 17:గుజరాత్‌లోని లోథల్‌లో "జాతీయ సముద్ర వారసత్వ సముదాయం అభివృద్ధికి సహకారం" (ఎన్ఎంహెచ్‌సీ) కోసం, కేంద్ర నౌకాశ్రయాలు, నౌక రవాణా, జలమార్గాల మంత్రిత్వ శాఖ (ఎంవోపీఎస్‌డబ్ల్యూ), కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ (ఎంవోసీ) ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. కేంద్ర నౌకాశ్రయాలు, నౌక రవాణా, జలమార్గాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) శ్రీ మన్‌సుఖ్ మాండవీయ, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) శ్రీ ప్రహ్లాద్ సింగ్ పటేల్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు జరిగాయి. దిల్లీలోని ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఎన్ఎంహెచ్‌సీ వంటి ప్రాజెక్టు దేశంలోనే మొదటిదని, మన దేశ గొప్ప, విభిన్న సముద్ర వైభవాన్ని చాటడానికి ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు శ్రీ మన్‌సుఖ్ మాండవీయ చెప్పారు. మన దేశ బలమైన సముద్ర చరిత్రను, గొప్పదైన తీర సంప్రదాయాన్ని ఒకేచోట ప్రదర్శించడానికి, భారతదేశ సముద్ర వారసత్వ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా పెంచడానికి ఈ ఎంవోయూ, సాంస్కృతిక శాఖ సహకారం ఉపకరిస్తుందని అన్నారు.

మన దేశ గొప్ప నిధి వంటి సాంస్కృతిక వారసత్వం గురించి మాట్లాడుతూ, ఆ నిధినంతా ఒకే ప్రాంతంలో ప్రదర్శించాల్సిన అవసరం ఉందని శ్రీ ప్రహ్లాద్ సింగ్ పటేల్ తెలిపారు. ఈ ఎంవోయూ, పురావస్తు ప్రదర్శనశాల కలిసి మన దేశ సాంస్కృతిక వారసత్వాన్ని చాటడంలో గొప్ప పాత్ర పోషిస్తాయని వెల్లడించారు. మన సాంస్కృతిక వారసత్వ గొప్పదనాన్ని పురావస్తు ప్రదర్శనశాలల ద్వారా ప్రపంచానికి తెలియజేయగలుగుతున్నామని అన్నారు.

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు 80 కి.మీ. దూరంలో ఉన్న లోథాల్‌లో, ఏఎస్ఐ ప్రాంతానికి సమీపంలో ఎంఎంహెచ్‌సీని ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. పూర్వకాలం నుంచి ప్రస్తుతకాలం వరకు ఉన్న మన దేశ సముద్ర వారసత్వాన్ని ప్రదర్శించే ప్రాంతంగా, ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దనున్నారు. భారతదేశ సముద్ర వారసత్వంపై ప్రపంచానికి అవగాహన పెంచడానికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన "ఎడ్యుటైన్‌మెంట్" విధానాన్ని ఇక్కడ ఉపయోగిస్తారు.

ఈ ప్రాజెక్టు నిర్మించేందుకు భూ బదలాయింపు పూర్తయింది. పర్యావరణ అనుమతి సహా అన్ని భూ సంబంధిత అనుమతులన్నీ వచ్చాయి.

ఎంఎంహెచ్‌సీని 400 ఎకరాల్లో అభివృద్ధి చేస్తారు. జాతీయ సముద్ర వారసత్వ ప్రదర్శనశాల, లైట్‌హౌస్ మ్యూజియం, వారసత్వ అంశాలతో రూపొందించిన పార్కు, మ్యూజియం తరహా హోటళ్లు, సముద్ర తరహా పర్యావరణహిత రిసార్టులు, సముద్ర సంస్థ వంటి విశిష్ఠ నిర్మాణాలను దశలవారీగా ఇక్కడ చేపడతారు.

క్రీ.పూ.2400 కాలంలో ఉన్న సింధు లోయ నాగరికత నాటి ప్రముఖ నగరాల్లో ఒకటైన పురాతన లోథల్ నగరాన్ని పునర్నిర్మించడం ఎన్ఎంహెచ్‌సీ ప్రత్యేకత. దీనికితోడు, వివిధ కాలాల్లో వర్ధిల్లిన భారత సముద్ర వారసత్వాన్ని వివిధ గ్యాలరీల ద్వారా ప్రదర్శిస్తారు. సముద్ర తీర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ సముద్ర సంబంధ కళాఖండాలు/ వారసత్వాన్ని ప్రదర్శించడానికి ఎన్ఎంహెచ్‌సీలో ప్రత్యేక కేటాయింపు ఉంటుంది.

సందర్శకులకు సంపూర్ణ పర్యాటక అనుభవాన్ని అందించేలా, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో, మారీటైమ్‌&నావల్ థీమ్ పార్కు, స్మారక కట్టడాల పార్కు, వాతావరణ మార్పుల పార్కు, సాహసాలు &వినోదాల పార్కు వంటి వివిధ అంశాలతో ఎంఎంహెచ్‌సీని అభివృద్ధి చేస్తారు.

## జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలి



మహబూబ్ నగర్, జూన్ 17:: వారం రోజుల్లో జడ్చర్ల- మహబూబ్ నగర్ రహదారికి ఇరుపక్కల మొక్కలు నాటడం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు అధికారులను ఆదేశించారు. గురువారం జడ్చర్ల నుంచి నక్కలబండ తాండ వరకు రహదారికి ఇరుపక్కల మొక్కలు నాటే విషయమై మున్సిపల్, అటవీ, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు.

జడ్చర్ల- మహబూబ్ నగర్ రహదారిలో నక్కలబండ తండా వరకు రెండు వైపులా మూడు వరుసల్లో మొక్కలు నాటాలని , వారంరోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఈ విషయమై తక్షణమే పనులు ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ సునీతకు ఆదేశాలు జారీ చేశారు. రహదారికి ఇరువైపులా నాటడంలో భాగంగా పెద్ద మొక్కలను తెప్పించి నాటాలని ఆదేశించారు. ఇందుకుగాను తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు.

## ప్రభుత్వాన్ని నడిపే సత్తా యడ్డీకి లేదు: బీజేపీ నేత సంచలన వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూన్ 17:కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్పపై సొంత పార్టీలోనే అసమ్మతి స్వరం పెరుగుతోంది. ఇప్పటికే పలువురు బీజేపీ నేతలు ఆయనపై విమర్శలు గుప్పించారు. తాజాగా బీజేపీ నేత, ఎమ్మెల్సీ హెచ్.విశ్వనాథ్ కూడా యడ్డీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యడియూరప్ప నాయకత్వంపై తమకు గౌరవం ఉందని? అయితే, ప్రస్తుతం ప్రభుత్వాన్ని నడిపే సత్తా మాత్రం ఆయనలో కొరవడిందని చెప్పారు. ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత, సత్తా యడియూరప్పకు లేవని ఆయన వ్యాఖ్యానించారు.

ఇదే విషయాన్ని కర్ణాటక బీజేపీ ఇన్ ఛార్జ్ అరుణ్ సింగ్ కు తెలిపారు. కర్ణాటక బీజేపీలో తలెత్తిన సంక్షోభం నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలతో రాష్ట్ర పార్టీ ఇన్ ఛార్జ్ అరుణ్ సింగ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో యడ్డీపై విశ్వనాథ్ ఎన్నో ఆరోపణలు చేశారు. యడ్డీ ప్రభుత్వంపై మంత్రులందరూ అసంతృప్తిగా ఉన్నారని ఆయన ఆరోపించారు. వంశపారంపర్య రాజకీయాలు ప్రమాదకరమని ప్రధాని మోదీ పదేపదే చెపుతుంటారని? అయితే కర్ణాటకలో ఇప్పుడు అదే రాజకీయం నడుస్తోందని ఆయన తెలిపారు. ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని తాను వెల్లడిస్తే? ప్రభుత్వం తన వ్యాఖ్యలను మరో విధంగా తీసుకుంటోందని విమర్శించారు. కర్ణాటక ప్రభుత్వ వ్యవహారాల్లో యడియూరప్ప కుటుంబ జోక్యం ఎక్కువైపోయిందని విశ్వనాథ్ చెప్పారు. ప్రతి డిపార్ట్ మెంట్ లో యడియూరప్ప కుమారుడు కలగజేసుకుంటున్నారని తెలిపారు.

కర్ణాటకలో కాంగ్రెస్- జనతాదళ్ సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడానికి కారణమైన 18 మంది ఎమ్మెల్యేల్లో విశ్వనాథ్ ఉన్నారు. జేడీఎస్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన పార్టీపై తిరుగుబాటు చేశారు. అనంతరం ఆయన బీజేపీలో ఫిరాయించి? 2019లో యడియూరప్ప సీఎం అయ్యేందుకు సహాయపడ్డారు. అయితే, ఉప ఎన్నికల్లో విశ్వనాథ్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

మరోవైపు బీజేపీ అధిష్టానం కర్ణాటక ముఖ్యమంత్రిని మార్చబోతోందంటూ గత కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. కొంతమంది బిజెపి ఎమ్మెల్యేలు బహిరంగంగానే యడియూరప్పపై విమర్శలకు దిగుతున్నారు. ఇటీవల యడియూరప్పను ప్రశంసిస్తూ.. అరుణ్‌సింగ్ ఫోన్ చేసినట్లు సమాచారం. కరోనా సంక్షోభాన్ని అరికట్టడంలో సీఎం చేసిన కృషి ప్రశంసనీయమని అరుణ్‌సింగ్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. అలాగే సీఎంగా యడియూరప్ప తన పదవీకాలాన్ని పూర్తి చేస్తారని హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా, లింగాయత్ నేత కర్ణాటకలో మొదటిసారిగా ముఖ్యమంత్రిగా పూర్తికాలం కొనసాగడం పార్టీకి లాభం చేకూరుతుందని బీజేపీ భావిస్తోంది. ఈ క్రమంలో విశ్వనాథ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కర్ణాటక రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి.

## ట్విట్టర్ కు కేంద్రం వార్నింగ్..

న్యూఢిల్లీ, జూన్ 17:ప్రముఖ సోషల్ నెట్వర్కింగ్ సైట్ ట్విట్టర్ కు, కేంద్రానికి మధ్య నడుస్తున్న వివాదంపై ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందించారు. కొత్త ఐటీ చట్టం అమలుకు ట్విట్టర్ కు తగిన సమయం ఇచ్చామని వెల్లడించారు. 3 నెలల సమయం ఇచ్చినా ట్విట్టర్ స్పందించలేదని ఆరోపించారు. ఇతర సంస్థలు ఐటీ చట్టాన్ని పాటిస్తుంటే ట్విట్టర్ కు అభ్యంతరమేంటి? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమించాలని ట్విట్టర్ ను అడిగామని, ట్విట్టర్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని తెలిపారు. భారత సంస్థలు అమెరికాలో నిబంధనలు పాటిస్తున్నాయని, అలాంటిది ట్విట్టర్ కు భారత్ లో నిబంధనలు పాటించడంలో వచ్చిన ఇబ్బంది ఏమిటని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రశ్నించారు. భారత్ లో వ్యాపారం చేయాలంటే నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రధానిని విమర్శించినా స్వాగతిస్తాం? కానీ నిబంధనలు పాటించడం మాత్రం తప్పనిసరి అని ట్విట్టర్ కు తేల్చి చెప్పారు.

# పగడపు ద్వీపంలో ప్రజా మంటలు

## (లక్షద్వీప్‌లో ఎగిసిన ప్రజాగ్రహ జ్వాలల నేపథ్యంలో)

దేశంలోనే అతి చిన్న కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్ పరిధిలో 36 ద్వీపాలు వస్తాయి. 1956లో కేరళ రాష్ట్రం ఏర్పడినపుడు లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతం(యుటీ)గా ఆవిర్భవించింది. అధిక ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న లక్షద్వీప్ జనాభా 65,000 ఉండగా, అందులో 96.6 శాతం ముస్లిమ్ జనాభా ఉన్నది. లక్షద్వీప్ ప్రజల జీవనాధారంగా పర్యాటకంతో పాటు సముద్ర ఆహార వేట వస్తాయి. అనాదిగా అభివృద్ధికి దూరంగా ప్రజలు పేదరికంలోనే జీవించడం జరుగుతున్నది. అగ్రభాగాన అడ్మినిస్ట్రేటర్ పాలన, స్థానికంగా 'ద్వీప్ పంచాయత్ కౌన్సిల్స్' పాలన చేస్తున్నాయి. ప్రస్తుతం ద్వీప సముద్రపు ప్రశాంతతకు భంగం వాటిల్లింది. పగడపు ద్వీపంలో మంటలు చెలరేగి వార్తల్లో నిలుస్తున్నది. గుజరాత్ ప్రభుత్వంలో హోంమంత్రి(2010-12)గా పని చేసిన ప్రఫుల్ ఖోడా పటేల్‌ను కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 2016లో 'దాద్రా అండ్ నగర్ హవేలి' అడ్మినిస్ట్రేటర్‌గా నియమించబడ్డారు. జనవరి 2020లో కొత్తగా ఏర్పడిన కేంద్రపాలిత ప్రాంతం 'దాద్రా అండ్ నగర్ హవేలీ అండ్ డమన్ అండ్ దయ్యు' అడ్మినిస్ట్రేటర్‌గా మరియు డిసెంబర్ 2020 నుంచి లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతానికి అడ్మినిస్ట్రేటర్ (గవర్నర్)గా అదనపు బాధ్యతలు కూడా స్వీకరించారు. లక్షద్వీప్ వార్తల్లో మార్మోగడానికి కారణమై ప్రఫుల్ ఖోధా పటేల్ వివాదాస్పద నిర్ణయాలే కారణమని అంటున్నారు. నేడు ద్వీపంలో ప్రజలు ఉద్యమించడం, తమ నిరసన జ్వాలలను వినిపించడం జరుగుతున్నది. ఈ ఉదంతంతో నేడు లక్షద్వీప్‌లో ఆర్థిక ప్రగతి కుంటుపడిందని ప్రతిపక్ష పార్టీలు విమర్శించే వరకు పరిస్థితులు దిగజారాయి.

### ప్రజా ఉద్యమాలకు కారణాలు:

లక్షద్వీప్ అడ్మినిస్ట్రేటర్ ప్రఫుల్ పటేల్ తీసుకున్న నిర్ణయాల్లో గోమాస నిషేధం, మద్యం విక్రయాల ఆంక్షలు ఎత్తివేయడం, సర్వాధికారాలు కలిగిన 'డెవలప్‌మెంట్ జోన్'గా ప్రకటించి నూతనంగా 'డెవలప్‌మెంట్ అథారిటీ' ప్రతిపాదించడం, కరోనా కట్టడిలో క్వారంటైన్ నిబంధనలు సడలించడం, పాసా (ఆంటీ-సోషల్ ఆక్టివిటీస్ ఆక్ట్) చట్టం తీసుకురావడం, ఇద్దరు పిల్లల కన్న ఎక్కువ సంతానం కలిగిన వారిని ఎన్నికల్లో నిలబడటానికి అనర్హులుగా ప్రకటించడం లాంటివి ముఖ్యమైనవి. ఈ నిర్ణయాలను ద్వీప ప్రజలు వ్యతిరేకిస్తూ, అసంతృప్తిని వ్యక్తం చేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతున్నది. లక్షద్వీప్ పంచాయత్ రెగ్యులేషన్ - 2021 ప్రకారం స్థానిక సంస్థల పరిధిలో ఉన్న విద్య, వైద్యం, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలను అడ్మినిస్ట్రేటర్ పరిధిలోకి తీసుకరావడం జరిగిందని, దీని వల్ల స్థానిక సంస్థలు నిర్వీర్యం అవుతాయని భావిస్తున్నారు.

### నటి ఆయేషా సుల్తానాపై దేశద్రోహం కేసు ఉదంతం :

లక్షద్వీప్ వ్యవహారంలో సినీనటి, ఫిల్మ్ మేకర్ ఆయేషా సుల్తానా మళయాలీ టీవీ చానెల్ చర్చలో మాట్లాడుతూ 'కరోనా వ్యాప్తికి చైనా వూహాన్ కారణమైతే, లక్షద్వీప్‌లో కరోనా వ్యాప్తికి భారత కేంద్ర ప్రభుత్వం రుద్దిన 'బయోలాజికల్ వెపన్ (జీవాయుధం)' కారణమని వ్యాఖ్యానించింది. ఆయేషా వ్యాఖ్యలు ద్వేషపూరితమైనవని, దేశ వ్యతిరేకమంటూ జూన్ 09న లక్షద్వీప్ బీజేపీ చీఫ్ అబ్దుల్ ఖాదర్ హాజీ దాఖలు చేసిన పిర్యాదు మేరకు ఆయేషాపై ఐపిసి సెక్షన్ 124ఏ దేశ ద్రోహ చట్టం కింద కవరట్టీ పోలీస్‌లు కేసు నమోదు చేశారు. ఆయేషాపై కేసు పెట్టడం, వివాదస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ లక్షద్వీప్ బీజేపీ నాయకులు కొందరు ఆమెకు మద్దతుగా నిలిచిన రాజీనామా కూడా చేయడం జరిగింది. ఈ ఉదంతంతో ప్రతిపక్ష పార్టీలన్నీ నిరసన గళాలను వినిపిస్తూ, ప్రజా ఉద్యమంగా మార్చడం జరిగింది. ఒక్క కరోనా కేసు కూడా కనిపించని లక్షద్వీప్‌లో ప్రఫుల్ పటేల్ నిర్ణయాలతో కోవిడ్-19 కేసులు బాగా పెరిగాయని వ్యాఖ్యానిస్తున్నారు. లక్షద్వీప్ సంస్కరణల పేరిట ప్రఫుల్ పటేల్ తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రఫుల్ పటేల్ లక్షద్వీప్ పర్యటన సందర్భంగా 'బ్లాక్ డే' నిర్వహించి నల్ల మాస్కులు, ఇళ్ళపై నల్ల జెండాలు ఎగురవేయడం, సముద్ర జలాల్లో మునిగి నిరసనలు తెలుపడం జరుగుతున్నది.

### పార్లమెంట్ సభ్యుడు మోహన్ దేల్కర్ ఆత్మహత్య:

దాద్రా ఱ నగర్ హవేలి పార్లమెంట్ సభ్యుడు 58 ఏండ్ల మోహన్ దేల్కర్ 22 ఫిబ్రవరి 2021న ముంబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఇండీపెండెంట్‌గా ఏడు సార్లు యంపిగా ఎన్నికైన అత్యంత ప్రజాధరణగల నాయకుడి అకాల మరణం ఇటీవల సంచలనం కావడం మనకు తెలుసు. మోహన్ దేల్కర్ వదిలిన 15 పేజీల సూసైడ్ నోట్‌లో దాద్రా ఱ నగర్ హవేలి అడ్మినిస్ట్రేటర్, యస్‌పి, కలెక్టర్ లాంటి వారి పేరును ప్రస్తావిస్తూ, ఈ ప్రాంత అభివృద్ధికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. మోహన్ నేతృత్వంలో నడుస్తున్న మెడికల్ కళాశాల, తను నిర్మించిన 'ఆదివాసీ కళ్యాణ్ భవన్' విషయాల్లో జోక్యం చేసుకున్నారని, పాలనలో ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని ప్రస్తావిస్తున్నారు. యంపి స్థాయి వ్యక్తి మోహన్ ఆత్మహత్యకు అసలు కారణం అన్వేషించి బాధ్యులను సత్వరం శిక్షించాల్సిందే.

లక్షద్వీప్‌లో జరగాల్సింది ఏమిటి ?

ఇలాంటి సంక్షోభ సమయాల్లో ప్రతి పక్షాలు, ప్రభుత్వ వ్యతిరేక శక్తులు, పాలనతో విభేదించే స్వార్థపరులు తమ ఉనికిని చాటుకుంటూ, అడ్మినిస్ట్రేషన్‌కు వ్యతిరేకంగా అభివృద్ధి నిరోధకులుగా కూడా పావులు కదపడం జరుగుతుంది. ఇటీవల 3000 కోట్ల విలువైన 300 కేజీల హెరాయిన్, ఐదు ఏకే-47 రైఫిల్స్‌ను మినికోవా ద్వీప సమీపాన అరేబియా సముద్రంలో పట్టుకోవడం జరిగింది. దీనికి తోడుగా అక్రమ మత్తు మందులు, ఆల్కహాల్ రవాణాను అడ్డుకొని పోక్సో చట్టం కింద అరెస్టు చేయడం కూడా జరిగింది. ఇలాంటి సంఘ వ్యతిరేక శక్తులను కూకటి వేళ్ళతో పెకిలించాల్సిందే. ద్వీప సమగ్రాభివృద్ధిని కాంక్షించి అడ్మినిస్ట్రేటర్ తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలనే కుటిల నీతి కూడా దాగి ఉండవచ్చు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో నిరసనను నూరి పోయడం, అభివృద్ధి బాటలకు అడ్డుపడుతూ పబ్బం గడుపుకునే ప్రబుద్ధులు కూడా ఉంటారు. ప్రభుత్వాలు ప్రజాసంక్షేమాన్ని లక్ష్యంగా తీసుకొని పని చేయాలని, రాజకీయ పార్టీలు ఓట్ల లెక్కలు మానుకొని ప్రజాహిత మాటలు జపించాలని, స్వార్థపరుల నోటికి తాళాలు వేసేలా కఠిన చర్యలు తీసుకొని కటకటాలను పరిచయం చేయాలని కోరుకుందాంద్దాం.

లక్షద్వీప్ పర్యావరణానికి భంగం కలుగకుండా, ప్రకృతి అందాలను పోషిస్తూ, 'ఇంటిగ్రేటెడ్ ఐలాండ్ మేనేజ్‌మెంట్ ప్లాన్' అమలు చేసేలా అడుగులు వేస్తున్న ప్రభుత్వ పథకాలను సమర్థిస్తూ రాజకీయాలకు అతీతంగా ద్వీపజన బంధువుల శ్రేయస్సు కోసం పాటుపడాలని కోరుకుందాం. నీతి ఆయోగ్ సహకారంతో మార్దీవుల అభివృద్ధి రీతిలో పలు పర్యాటక స్థలాలైన మినికోయ్, కద్మత్, సహేళి కేంద్రాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయటానికి ప్రజాసహకారం అవసరమని గుర్తించాలి. స్థానిక సంస్థల చట్టంలో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించడం హర్షదాయకం. ఉన్నత విద్యకు ప్రాధాన్యతను ఇస్తూ పలు రకాలైన కళాశాలలను నెలకొల్పి యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములుగా చేయాల్సిందే. అగట్టీ విమానాశ్రయం, మైనింగ్, రైల్వే, క్వారీ, జాతీయ రహదారులు, ట్రామ్‌వేలను అభివృద్ధి చేయడంలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకోవలసిందే. మత్స్యపరిశ్రమను ప్రోత్సహించేలా పలు పథకాల అమలుకు కంకనబద్ధులు కావాలి. 73-ఏండ్ల స్వతంత్ర భారతంలో నేటికీ లక్షద్వీప్‌లో ఇంటర్నెట్ కనెక్టివిటీ పెద్ద సమస్యగానే కొనసాగుతున్నది. నేడు కేంద్రప్రభుత్వం 1,072 కోట్ల నిధులతో సబ్‌మెరైన్ ఆప్టికల్ ఫైబర్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తూ 2023-24 వరకు పూర్తి చేసేలా ముందుకు సాగుతున్నది. దేశ భూభాగానికి 500 కిమీల దూరంలో ఉన్న లక్షద్వీప్‌ను భరతమాత మనసుకు దగ్గరగా, సంపూర్ణ ఆరోగ్య సౌభాగ్య కేంద్రంగా రూపాంతరం చెందేలా సమగ్రాభివృద్ధి పరుచుకుందాం. లక్షద్వీప్ ప్రజల జీవనశైలిని, హక్కులను, స్వేచ్ఛను, ఆచారవ్యవహారాలను కాపాడుతూ ద్వీపాన్ని దేశ ద్వీపస్తంభంగా రూపొందిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# విశాఖలో పీవీ సింధు అకాడమీకి 2 ఎకరాల భూమి

అమరావతి, జూన్ 17:భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ఏపీ ప్రభుత్వం 2 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ జారీ చేసింది. విశాఖలో పీవీ సింధు అకాడమీకి భూమిని కేటాయించింది. విశాఖ రూరల్ మండలి చినగాదిలి వద్ద 2 ఎకరాల భూమిని పీవీ సింధుకు కేటాయిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ భూమి పశుసంవర్ధక శాఖకు చెందినది కాగా, పీవీ సింధుకు అందించేందుకు వీలుగా, దాన్ని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు బదలాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో తెలిపారు.తనకు భూమిని కేటాయిస్తే బ్యాడ్మింటన్ కోచింగ్ అకాడమీ, స్పోర్ట్స్ స్కూల్ నెలకొల్పుతానని పీవీ సింధు గతంలో వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. పీవీ సింధు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ రంగంలో సాధించిన ఘనతలకు గుర్తింపుగా ఏపీ ప్రభుత్వం? విశాఖలోని చిన గాదిలి వద్ద స్థలాన్ని ఉచితంగా అందించాలని నిర్ణయించింది. ప్రతిభ కలిగిన పేదల పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించేందుకు సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు.

# నూతన విద్యావిధానంతో విద్యార్థులకు మేలు: సీఎం

అమరావతి, జూన్ 17:నూతన విద్యావిధానం వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎనలేని మేలు జరుగుతుందని సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఇప్పటివారికే కాదు తర్వాతి తరాలకు కూడా విశేష ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యాశాఖ, అంగన్‌వాడీల్లో నాడు?నేడుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నూతన విద్యా విధానంపై సమీక్షించిన సీఎం.. నూతన విద్యా విధానం అమలు కోసం కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రెండేళ్లలో కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, దీని కోసం అయ్యే ఖర్చుతో వివరాలు తయారు చేయాలని సీఎం ఆదేశించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నూతన విద్యా విధానంవల్ల జరిగే మేలును వివరించాలన్నారు. ఉపాధ్యాయుల్లో, ఇతర భాగస్వాముల్లో అవగాహన, చైతన్యం కలిగించాలని సీఎం సూచించారు .మండలానికి ఒకటి లేదా రెండు జూనియర్ కాలేజీలు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆట స్థలం లేని స్కూళ్లకు నాడు-నేడు కింద భూమి కొనుగోలు, వచ్చే ఏడాది నుంచి విద్యా కానుకలో అదనంగా స్పోర్ట్స్ దుస్తులు, షూ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు.

స్కూళ్లు,అంగన్వాడీల్లో ఒక్క ఉద్యోగిని కూడా తొలగించడం లేదని, ఒక్క సెంటర్‌ను కూడా మూసివేయడం లేదని సీఎం తెలిపారు. రెండు రకాల స్కూళ్లు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని చెప్పారు. పీపీ1, పీపీ2, ప్రిపరేటరీ క్లాస్, ఒకటి, రెండు తరగతులు ఒకటిగానూ ఉంటారన్న సీఎం? వీరందరికీ కిలోమీటరు పరిధిలోపు వీరికి స్కూలు ఉంటుందని వివరించారు. మిగిలిన తరగతులు అంటే.. 3 నుంచి10 వ తరగతి వరకూ సమీపంలోనే ఉన్న హైస్కూల్ పరిధిలోకి తీసుకురావాలని, ఆ స్కూలు కూడా కేవలం 3 కి.మీ పరిధిలో ఉండాలని సీఎం జగన్ స్పష్టం చేశారు.

# ఇంటర్నెట్ డౌన్.. బ్యాంకులు, ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్లు క్రాష్

న్యూఢిల్లీ, జూన్ 17:ఆస్ట్రేలియాకు చెందిన సెంట్రల్ బ్యాంక్‌తో పాటు ఆ దేశ పోస్టల్ సర్వీసు, ఇతర బ్యాంకుల వెబ్‌సైట్లు క్రాష్ అయ్యాయి. అమెరికాకు చెందిన కొన్ని ఎయిర్‌లైన్స్‌కు కూడా ఇంటర్నెట్ సరఫరా నిలిచిపోవడంతో వాటి సైట్లు డౌన్ అయినట్లు తెలుస్తోంది. వెబ్ సర్వీస్ కంపెనీ అకామాయిలో సమస్యలు తలెత్తడంతో.. అనేక సంస్థల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఏఎన్‌జెడ్, వెస్ట్‌ప్యాక్, సెయింట్ జార్జ్, ఎంఈ బ్యాంక్, మాక్వయిరీ బ్యాంక్, అలియాంజ్, కామన్‌వెల్త్ బ్యాంక్‌లకు సేవలు తాత్కాలికంగా స్తంభించిపోయాయి. బ్యాంకింగ్ యాప్‌లు కూడా అందుబాటులో లేకుండాపోయాయి. అమెరికన్ ఎయిర్‌లైన్స్, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్, డెల్టా ఎయిర్‌లైన్స్ కూడా ఇంటర్నెట్ లేకపోవడంతో వాటి వెబ్‌సైట్లు క్రాష్ అయ్యాయి. ఇంటర్నెట్ లేకపోవడానికి తామే కారణమని అకామాయి అంగీకరించింది. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆ సంస్థ చెప్పింది.

# 31రోజుల నుండి కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం




రాజన్న సిరిసిల్ల, జూన్ 15(నేటినిజం ప్రతినిధి): మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు' ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు గురువారం 31వ రోజుకు చేరాయి.ఇందులో భాగంగా గురువారం లక్ష్మి గణపతి కాంప్లెక్స్ వద్ద మరియూ ఆలయ పరిధిలో ఉంటున్న అన్నార్థులకు , హోమ్ ఐసోలేషన్ నందు ఉన్న కరోనా పేషంట్లకు మొత్తం 100 మందికి అన్నదానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేశ్, గొంగళ్ల రవికుమార్ ,తాళ్లపెల్లి ప్రశాంత్, భస్మాంగి బస్వరాజు, ప్రతాప నటరాజు, కొప్పుల హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

# 15 రోజులకు చేరుకున్న సోనూ సూద్ ఫ్యాన్స్ క్లబ్ ఆర్గనైజేషన్ సేవలు




రాజన్న సిరిసిల్ల, జూన్ 15(నేటినిజం ప్రతినిధి): సోను సూద్ ఫ్యాన్స్ క్లబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు గురువారం 15వరోజుకు చేరాయి. గురువారంకరీంనగర్ జిల్లా కేంద్రంలో కోవిడ్ పేషెంట్ల బంధువులకు, మిత్రులకు అలాగే పాదరక్షకులకు, బస్టాండ్లో ఉన్న హమాలీలకు సోనూ సూద్ ఫ్యాన్స్ క్లబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అన్నం , గుడ్లు, జావ ప్యాకెట్లు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా సోనూ సూద్ ఫ్యాన్స్ క్లబ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు అయా లతిరుపతి మాట్లాడుతూ గత పదిహేను రోజుల నుండి సేవాకార్యక్రమాలు చేపడుతున్నామని ఇలాంటి కార్యక్రమాలు ఇంకాముందుకుతీసుకువెళ్లడానికి సోను సూద్ ఫ్యాన్స్ క్లబ్ తరపున మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ముఖ్యంగా మా క్లబ్ లో ఆసక్తిగల యువకులు ఎవరైనా వంద రూపాయలు చెల్లించి జాయిన్ అయిన వారికి వెయ్యి రూపాయల విలువైన కొవిడ్ కిట్ ఉచితంగా ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సోను సూద్ ఫ్యాన్స్ క్లబ్ ఆర్గనైజేషన్ నాయకులుగాంధీ,విజయ్,ఉదయ్, రాజకుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు...

# కరోనాతో నిలిచిన కరాటే శిక్షణ కేంద్రాలు .... ప్రభుత్వ సహకారం కోసం ఎదురు చూపులు





రాజన్న సిరిసిల్ల, జూన్ 15(నేటినిజం ప్రతినిధి): కరాటే ఈ పదం ప్రతి వ్యక్తి బాల్యం నుండి వినె పదం , మనసును , మనిషికి ఆత్మవిశ్వాసం కలిగించే పదం , కరాటే వల్ల శారీరక మానసిక ఆరోగ్యంతో పాటు శారీరిక దారుఢ్యాన్ని పెంపొందిస్తుంది . కరాటే నేర్చుకోవాలంటే కరాటే గురువు ( మాస్టర్ ) ఎంతో అవసరం , మహిళలపట్ల చిన్నచూపు చూస్తున్న కాలం నుండి ఎందరో మహిళలు ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని కరాటే నేర్చుకొని పురుషులకు తగ్గ పోటీ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి , అలాంటి కరాటే శిక్షణలు ఇప్పుడు మూతపడ్డాయి . నిత్యం పిల్లలనుండి ఎందరికో శిక్షణ ఇచ్చే గురువులు తాము ట్రైనింగ్ ఇవ్వలేకా , తమ కుటుంబాన్ని గడుపుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు . ఈ వైనం పై .నేటి నిజం ప్రత్యేక కథనం అందిస్తుంది .. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వంద మంది మాస్టర్లు యాదది నుంచి ఉపాధి లేక రోడ్డున పడ్డారు . కరాటే శిక్షణ ఇస్తూ తెలంగాణా రాష్ట్రంలో సుమారుగా వేల కొద్దీ కరాటే మాస్టర్స్ జీవనోపాధి పొందుతున్నారు . ఆయా ప్రాంతాల్లోని విద్యాలయాల్లో పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణలు ఇస్తుంటారు . శిక్షణ ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు .

కొందరు మాస్టర్స్ ప్రస్తుతం కుటుంబం అంతా ఒక పూట భోజనం చేయలేని పరిస్థితి ఉందంటే ఎంతటో కష్టలా స్థితిలో ఉన్నారంటే ఎవరు నమ్మలేరు కావచ్చు కానీ అది నిజంసమాజంలో గురువుగా మర్యాద కారణంగా వేరే పని చేయలేకచావ లేని దుర్భరామైన జీవితంలో కరాటే మాస్టర్లు ఉన్నారు . కుటుంబం పోషణ చాలా కష్టంగా మారికొంత మంది కరాటే మాస్టర్ ల కుటుంబ సభ్యులు అనారోగ్యాల బారిన పడితే వైద్యం చేయించుకునే పరిస్థితి లేక కొట్టుమిట్టాడుతున్నారు . సమాజంలో మహిళలు , బాలికలపై జరుగుతున్న అఘాయిత్యలను ఎదుర్కోవాలంటే వారి ఆత్మ రక్షణ కోసం కరాటే శిక్షణ తప్పనిసరి పరిస్థితి . ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది . అదే కాకుండా ప్రస్తుతం ప్రపంచంలో కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ వ్యాయామం తప్పనిసరి అవసరమైంది . కరాటే శిక్షణ పొందడం వల్ల మానసిక ధైర్యం పెరుగుతుంది . నిత్యం వ్యాయామం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతూ కరోనా మహమ్మారిని జయించే అవకాశం ఉంది . కోవిడ్ నియమాలు అమలు చేస్తూ ... సామాజిక దూరాన్ని పాటిస్తూ .. కరాటే శిక్షణ సెంటర్లు నిర్వహించుకునే ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని వేడుకుంటున్నారు . రాష్ట్రంలో ప్రైవేటూ టీచర్లకు ఇస్తున్న మాదిరిగానే తెలంగాణలో కరాటే శిక్షణ పై ఆధార పడ్డ కరాటే మాస్టర్ లకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందించాలని , ఒకినావా స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ అసోసియేషన్ పౌండర్ కోచ్ రాజన్న సిరిసిల్ల జిల్లా స్పోర్ట్స్ డో కరాటే అసోసియేషన్ - జనరల్ సెక్రెటరీ ఎమ్ .ఏ . మన్నాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి




రాజన్న సిరిసిల్ల, జూన్ 15(నేటినిజం ప్రతినిధి): కళను నమ్ముకుని బతుకుతున్న కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ అధ్యక్షుడుఎల్లా పోశెట్టి అర్బన్ తహశీల్దార్ మునిందర్ కు ఒక వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 25 కిలోల బియ్యం, 2 వేల రూపాయిల గౌరవ వేతనం ఇచ్చినట్టే కళను నమ్ముకుని బతుకుతున్న కళాకారులకు కూడా ప్రభుత్వం తరుపున గౌరవ వేతనం, 25 కిలోల బియ్యం అందజేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కళాకారులకు ఆరోగ్య భద్రత కల్పించాలని, పెన్షన్ వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు స్వామినేని బాలు, యూట్యూబ్ కళాకారులు కనపర్తి హనుమండ్లు, అధ్యక్షులు గంగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు వెంపటి సంతోష్ కుమార్, బోండ్ల శ్రీనివాస్ ముదిరాజ్, ఎర్ర రవి రాజా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతిలో అందరు భాగస్వాములు కావాలి




ఖమ్మం, జూన్ 17: : పల్లెలు, పట్టణాలు నూటికి నూరుశాతం అభివృద్ధిని సాధించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం కావాలని రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎమ్మెల్యేలు, జడ్పీ, మున్సిపల్ చైర్మన్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, ఎంపీడీఓలు, స్పెషల్ ఆఫీసర్స్, ఇతర అధికారులతో గతంలో చేపట్టిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పురోగతి, మళ్ళీ నిర్వహించనున్న పల్లె, పట్టణ ప్రగతిపై క్షేత్ర స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ..20వ తేదీ నుంచి జిల్లాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తం గా ఉండాలన్నారు. నేటి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు కథనరంగంలోకి దిగాల్సిన ఆవశ్యకత ఉందని మంత్రి పేర్కొన్నారు.

అధికారులు నిర్భీతిగా తమ బాధ్యతలను నిర్వర్తించాలని స్పష్టం చేశారు. మీ పని మీరు సమర్థవంతంగా చేయండి. మీరు ఎవ్వరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. మీకు ఏ సహాయం కావాలన్నా అందుబాటులో ఉంటానని మంత్రి హామీనిచ్చారు. మంచిగ పనిచేసిన వాళ్లను గుర్తించి అవార్డులు, రివార్డులు అందజేస్తామని, అదే విధంగా పని చేయని వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గత పట్టణ, పల్లె ప్రగతిలో చేపట్టిన పనులలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, నర్సరీ, వైకుంఠధామం, డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. కాగా, అతి తక్కువ శాతంలో కొన్ని డంపింగ్ యార్డులు, వైకుంఠధామం లు ప్రారంభం కాలేదన్నారు. వాటికి తక్షణమే స్థానిక ప్రజాప్రతినిధులు పునుకొని వాటిని ప్రారంభించి వాడుకలోకి తేవాలన్నారు.

గ్రామంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రత బాధ్యత బాధ్యతను గ్రామ సర్పంచి తీసుకోవాలి. మున్సిపాలిటీల పరిధిలోని ప్రజాసంబంధ సంస్థల పారిశుధ్య బాధ్యతను మున్సిపాలిటీ పాలకవర్గాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకు గ్రామ కార్యదర్శి బాధ్యత వహించాలన్నారు.సమీక్షా సమావేశం సందర్భంగా మండల వారీగా ప్రగతి పురోగతిని గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి గొప్పగా పనిచేస్తున్నయని, అయితే ప్రతి సీజన్ లో సీజన్ ప్రారంభానికి ముందే వైద్యశాఖతో అటు పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు కలిసి కూర్చోని వ్యాధులను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

సుకోవాలన్నారు. ప్రజల వైద్యం, ఆరోగ్య విషయంలో అదనపు కలెక్టర్లే బాధ్యత తీసుకోవాలని సూచించారు పట్టణాల్లో మహిళలకు ఇబ్బంది లేకుండా పబ్లిక్ టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతుల పట్ల అటవీ శాఖ అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారని, ఇది సరైన చర్యకాదన్నారు.

ఇలాంటి చర్యకు మానుకొని ప్రభుత్వంకు మంచి పేరు వచ్చే విధంగా పని చేయాలని హితువు పలికారు. మండల పీహెచ్ స్థాయిల్లో సీజనల్ వ్యాధులను తగ్గించేందుకు శాఖల వారీగా సమన్వయం చేసుకొంటూ అధికారులు పక్కాగా పని చేయాలన్నారు.

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మెరైన్ హెరిటేజ్ కాంప్లెక్స్ డెవలప్మెంట్?

న్యూఢిల్లీ, జూన్ 17:గుజరాత్‌లోని లోథల్‌లో "జాతీయ సముద్ర వారసత్వ సముదాయఅభివృద్ధి కోసం కేంద్ర నౌకాశ్రయాలు,నౌక రవాణా,జలమార్గాల మంత్రిత్వ శాఖ (ఎంవోపీఎస్‌డబ్ల్యూ), కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. కేంద్ర నౌకాశ్రయాలు, నౌక రవాణా, జలమార్గాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు జరిగాయి.

ఢిల్లీలోని ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు 80 కి.మీ. దూరంలో ఉన్న లోథాల్‌లో, ఏఎస్ఐ ప్రాంతానికి సమీపంలో ఎంఎంహెచ్‌సీని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. పూర్వకాలం నుంచి ప్రస్తుతకాలం వరకు ఉన్న మన దేశ సముద్ర వారసత్వాన్ని ప్రదర్శించే ప్రాంతంగా, వరల్డ్ టూరిజం డెస్టినేషన్ గా తీర్చిదిద్దనున్నారు. భారతదేశ సముద్ర వారసత్వంపై ప్రపంచానికి అవగాహన పెంచడానికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన "ఎడ్యుటైన్‌మెంట్" విధానాన్ని ఇక్కడ ఉపయోగిస్తారు.ఎన్ఎంహెచ్‌సీ వంటి ప్రాజెక్టు దేశంలోనే మొదటిదని, మన దేశంలోని సముద్ర వైభవాన్ని చాటడానికి ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. మన దేశ సముద్ర చరిత్రను, గొప్ప తీర సంప్రదాయాన్ని ఒకచోట ప్రదర్శించడానికి,భారతదేశ సముద్ర వారసత్వ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా పెంచడానికి ఈ ఎంవోయూ,సాంస్కృతిక శాఖ సహకారం ఉపకరిస్తుందనిఆయన అన్నారు.

# స్మార్ట్‌హోమ్ కోసం ఇంటిగ్రేటెడ్ ఐఓటీ పరిష్కారాలను ఆవిష్కరించిన లైఫ్‌లాంగ్

హైదరాబాద్ , జూన్ 17: సుప్రసిద్ధ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సంస్థ లైఫ్‌లాంగ్, భారతీయ గృహాల కోసం సమగ్రమైన ఐఓటీ పరిష్కారాలతో స్మార్ట్ హోమ్‌ను విడుదల చేసింది. సంస్థ వెబ్‌సైట్‌తో పాటుగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి పలు ఈకామర్స్ వెబ్‌సైట్లలో కూడా ఇది లభ్యమవుతుంది. దశల వారీగా, తమ విస్తృతశ్రేణి ఐఓటీ పరిష్కారాలను లైఫ్‌లాంగ్ అందుబాటులో ఉంచనుంది. వీటిలో గాడ్జెట్లు, అప్లయెన్సెస్, సెక్యూరిటీ పరిష్కారాలు సైతం ఉన్నాయి. ప్రస్తుతం స్మార్ట్ బల్బులు, స్మార్ట్ స్మోక్ డిటెక్టర్లు, స్మార్ట్ ప్లగ్‌లు మొదలైనవి సంస్థ అందిస్తుంది. ఐఓటీ కనెక్టివిటీతో అత్యాధునిక విశ్లేషణలు మిళితం చేయబడిన ఈ స్మార్ట్ హోమ్ పరిష్కారాలు లైఫ్‌లాంగ్ యొక్క స్టెల్లార్ నాణ్యత వాగ్దానం చేస్తుంది. దేశవ్యాప్తంగా ఈ ఉత్పత్తులు లభ్యమవుతున్నాయి. ఈ శ్రేణి గురించి లైఫ్‌లాంగ్ ఆన్‌లైన్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ కో?ఫౌండర్ వరుణ్ గ్రోవర్ మాట్లాడుతూ "ఐఓటీ క్రింద సమగ్రమైన స్మార్ట్‌హోమ్ పరిష్కారాలను ఆవిష్కరించడానికి మేము ప్రణాళిక చేశాం. దీనిలో భాగంగానే వినియోగదారులు ఒకే యాప్ ద్వారా తమ ఇళ్లను నిర్వహించే సౌకర్యం అందిస్తున్నాం. వారు తమ ఎలక్ట్రికల్ అప్లయెన్సెస్‌ను నిర్వహించడంతో పాటుగా అత్యంత అప్రమత్తతతో విద్యుత్‌నూ వినియోగించుకోవచ్చు మరియు తమ ఇంటిని మరింత సురక్షితంగా సమగ్రశ్రేణి భద్రతా పరిష్కారాలతో మలుచుకోవచ్చు. భారతీయ స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ఈ ఉత్పత్తులను తీర్చిదిద్దాం.

# వీకెండ్‌లో పిల్లలకు ప్రియమైన గుమ్మో బిందాస్ భాలుకి క్లాస్




హైదరాబాద్ , జూన్ 17:మనందరికీ ఒక స్నేహితుడు వున్నాడు, అతను తెలివిలేని వాడు కాని మంచివాడు. మనం నేలమీద వడి దొర్లుతూ నవ్వేలా మనల్ని ఆనందపరుస్తాడు అలాగే అన్ని కష్టాలను మరచిపోయేలా వారు ఎల్లప్పుడూ సంతోషంగా ఉండేలా అద్భుతమైన సరదాలను సృష్టిస్తాడు. అతనే గుమ్మో, సోనియే! లో భాలు యే బిందాస్ హై, ప్రదర్శనలో ధ్రువ ఎలుగు బంటిగా మన ముందుకు వస్తున్నాడు. ఈ ప్రదర్శన గుమ్మో యొక్క హాస్యాస్పద సాహసాల యొక్క చిన్న కథలను వివరిస్తుంది, ఏవైనా అడ్డంకులను అధిగమించాలనే దృఢ నిశ్చయంతో ఉన్న అతని వికృత చేష్టలు పిల్లలను ఆనందపరిచేలా చేస్తాయి. ఈ ప్రదర్శనను మొదట డేవిడ్ బ్యాక్‌హమ్ అని పిలిచేవారు, ఇది చాలా ప్రశంసలు గెలుచుకున్న టీవీ సిరీస్, దీనిని తాజా దేశీ కథనంలో ఛానెల్ తిరిగి ప్రసారం చేస్తున్నారు. అతని వింత చేష్టలను మరింత సెలబ్రేట్ చేసుకుంటూ, ఛానెల్ ప్రత్యక కార్యక్రమన్ని 19 జూన్,సాయంత్రం 4 గంటలకు బిందాస్ భాలుకి క్లాస్ పోను నిర్వహిస్తుంది. గుమ్మో యొక్క ప్రపంచం తలక్రిందులుగా మారిన ప్రతిసారీ అతను క్రొత్త దాన్ని ప్రయత్నించినప్పుడు ప్రదర్శన నుండి ఎంపిక చేసిన కథల స్నిప్పట్లను ఈ సెసన్ ప్రదరిస్తుంది. పిల్లలు తమ సృజనాత్మకతను భాలు యొక్క నిజమైన శైలిలో డూడుల్ వర్క్‌షాప్‌తో ప్రసారంచేసే అవకాశం కూడా లభిస్తుంది, ఈ కార్యక్రమాన్ని సుప్రసిద్ధ చిల్డ్రన్ బుక్ ఇల్లు స్ట్రేటర్ - సునయనాదే హోస్ట్ చేసారు. డూడ్లింగ్ చమత్కారమైన కళా రూపం ద్వారా, యువ అభిమానులు తమను తాము ఎలా వ్యక్తీకరించాలో నేర్చుకుంటారు వారి పగటి కలలకు ఒక రూపం ఇస్తారు. దిస్వింగ్ బోర్డ్ వ్యవస్థాపకుడు ఎడ్విన్నాలో లోబో ఆర్ట్ మానియా మరింత క్రేజీగా ఉంటుంది. పిల్లలు నియమాలను పాటించక పోవడాన్ని వారి మూర్ఖత్వంతో ఆమె ఆర్గ్నాన్స్‌లో

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్న పిటిసి అధికారులు




కరీంనగర్ జూన్ 17(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్‌లోని రాంనగర్‌లో గల పోలీసు శిక్షణ కళాశాల(పిటిసి)కి చెందిన అన్నిస్థాయిలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది ఇటీవల కరోనాతో మృతి చెందిన కాంట్రాక్ట్ దోభి నడిగొట్టు రాజేశం(53)కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థికసహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. గురువారం నాడు కళాశాల ప్రిన్సిపాల్ వి సునీతమోహన్ 50వేలరూపాయల ఆర్థికసహాయాన్ని మృతుడి భార్య విజయకు అధికారులు, సిబ్బంది సమక్షంలో అందజేశారు.

పిటిసిలో 2017 నుండి మృతుడు రాజేశం కాంట్రాక్ట్ పద్ధతిలో దోభి వృత్తిని నిర్వహిస్తున్నాడు. ఇటీవల కరోనాతో మృతిచెందాడు. ఆతడి కుటుంబానికి చేదోడువాడోదుగా నిలువాలనే ఉద్దేశంతో ఈ ఆర్థికసహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవి, డిఎస్‌పి గంగాధర్, సిఎల్ఐ అఫ్జలొద్దీన్, ఆర్ఐ త్రిముక్, ఎస్ఐలు టి రమేష్, నసీమొద్దీన్‌లతోపాటుగా పలువురు పిటిసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.